
బుజ్జాయి
ఏప్రిల్ - 2018
Rs 20


హోటల్ శ్రీ గ్రాండ్స్
Hotel
Sri Grands
Most Spacious
HOTEL SRI GRANDS
Hotel Sri Grands
87-1-13/1 Opp. RTC Bus Stand, Rajahmundry - 533 103. A.P.
Ph: 0883-2468977, Cell: 8099664555 hotelsrigrands@gmail.com



గాంధీజీ నేర్పిన పాఠం

గాంధీజీ మొట్టమొదటిసారిగా ప్రజా జీవితంలో అడుగు పెట్టినప్పటి రోజులవి. ఓరోజు గాంధీజీ తన మిత్రుడితో కలిసి అతని కారులో ప్రయాణం చేస్తున్నారు. గాంధీజీ అలా ప్రయాణం చేయడం నచ్చని కొందరు వ్యతిరేకులు ఆయనకు అడ్డంకులు కల్పించడానికిగాను ఓ చెట్టు చాటు నుంచి కారుపై రాళ్లు రువ్వారు. రాళ్ళు కారుమీద పడగానే గాంధీజీ మిత్రుడితో కారును ఓ పక్కగా ఆపమన్నారు.

అనంతరం ఆయన కారు లోంచి కిందకు దిగారు. చుట్టూ చూశారు. కనుచూపుమేరలో ఓ చెట్టు దగ్గర నిల్చున్న కొందరిని గాంధీజీ చూశారు. వారు తప్ప మరెవ్వరూ కనిపించలేదు. దాంతో తిన్నగా వారి దగ్గరకు వెళ్లారు. వాళ్లే రాళ్ళు విసిరి ఉండొచ్చని అనుకున్నారు.

వారిని సమీపించి "మీకు నా మీద కోపం ఉండొచ్చు. కాదనను. ఆ కోపం మీవరకూ సబబేకూడా అయి ఉండొచ్చు. అది కూడా నేను కాదనను. కనుక మీ కోపాన్ని చూపాలనుకుంటే నామీద రాళ్ళు విసరాలే తప్ప పాపం ఈ కారు ఏం చేసింది? అది మిమ్మల్నేమీ చెయ్యలేదుగా? అంతేకాదు, ఆ కారు కూడా నాది కాదు. నా మిత్రుడిది. ఇప్పుడు కూడా చెప్తున్నాను. మీరు మీ కోపాన్ని నా మీద చూపండి. ఇదిగో మీముందే నిల్చున్నాను. మీ ఇష్టమొచ్చినట్టు చేసుకోండి, నేను మీమందు ఒంటరిగా నిల్చున్నాను. నన్ను మీరేమైనా చేసుకోవచ్చు. నేనేమీ అనుకోను. కారు మీద రాళ్ళు విసరడం వల్ల అది మిమ్మల్నేమీ చెయ్యలేదు. చెయ్యదు కూడా. కానీ కారు నాశనమవుతుంది. అప్పుడు నా మిత్రుడు బాధపడతాడు. నష్టం అతనికి తప్ప నాకు కాదుగా..." అని గాంధీజీ చెప్పడంతో ఆయనను ఆట పట్టించాలనుకున్న వాళ్ళు గాంధీజీ మాటలకు సిగ్గుపడి తల దించుకున్నారు. కాస్సేపు అక్కడ మౌనం తాండవించింది. అనంతరం ఆ అల్లరిమూక గాంధీజీ కాళ్ళపై పడి తమను క్షమించాలని అడిగారు.

అయితే గాంధీజీ ఇలా అన్నారు.

"ఇప్పటికైనా మీ తప్పు మీరు తెలుసుకున్నారు. ఇప్పుడే కాదు, ఇంకెప్పుడైనాసరే, మీకు ఎవరి మీద కోపముంటే వారిపైనే మీ కోపాన్ని చూపించండి. అంతేతప్ప మరొకరిపై మీ అక్కసును వెళ్ళబోసుకోవడం సరికాదు. అయినా కోపాన్ని మీరు సక్రమమైన వాటికి ప్రదర్శిస్తే అది నలుగురికీ ఉపయోగపడుతుంది. అంతేతప్ప కోపం సరైన పద్ధతికాదు. తన కోపమే తన శత్రువు అనేది తెలుసుకోండి. ఈర్ష్యా ద్వేషాలు ఎప్పుడూ పనికిరావు. అవి వినాశనానికే తప్ప మన ఎదుగుదలకు తోడ్పడవు. కోపం వల్ల విచక్షణ కోల్పోతాం. అప్పుడు మనం మాట్లాడే మాటలు ఎదుటివారిని గాయపరచినట్టు అనుకుంటాం. కానీ ఆ తర్వాత మనం స్థిమితంగా ఓ చోట కూర్చుని ఆలోచిస్తే ఆ మన పెదవి దాటిన మాటలవల్ల కలిగే నష్టం ఎంతన్నది తెలిసి బాధపడతాం. అంతకన్నా నాలుగు దెబ్బలు భరించవచ్చేమో కానీ పెదవి దాటిన మాటలు జీవితాంతం మనిషిని నొప్పిస్తూనే ఉంటాయి. అందుకే కోపాన్ని వీలున్నంతవరకూ నియంత్రించుకోవడం మంచిపద్ధతి....కోపం ఎందుకు వచ్చిందో నిదానంగా ఆలోచిస్తే తప్పెవరిదో బోధ పడుతుంది. నిజంగానే తప్పు మనదైతే క్షమించమని అడగడం, లేదా వారిది తప్పయితే వారే క్షమించమని మనల్ని అడగడం జరుగుతుంది...దాంతో కోపానికి తెర పడుతుంది" అని చెప్పారు.

యామిజాల జగదీశ్ - హైద్రాబాద్

దైవత్వానికి మార్గం!!

ధర్మలక్షణాలను పాటించేకొద్దీ మూర్ఖత్వం, కర్కశత్వంపోయి, దైవత్వం కలుగుతుంది. సుఖశాంతులతో జీవితమూ అలరారుతుంది. అంతేకాదు, ఆధ్యాత్మిక జీవనం వికసిస్తుంది. అందుకే అంటుంటారు పెద్దలు, "ధర్మమార్గమే క్షేమమని."

సత్పురుషులు సంచరించిన ధర్మమార్గమే మనం అనుసరించవలసినది. విశ్వామిత్రుడు, భరద్వాజుడు, శరభంగుడు, సుతీక్ష్ణుడు, తదితర మహర్షులు రాముడికి ఋషులు నడచిన మార్గాన్నే నిర్దేశించారు. రాముడుకూడా ఆ మార్గాన్నే అనుసరించాడు. అందరికీ ఆదర్శనీయుడు అయ్యాడు. శీలం, సత్యం, ధర్మం, శౌచము వంటివి వినడానికీ, చెప్పుకోవడానికీ పాతవేకావచ్చు కానీ అవే శ్రీరామరక్ష.

ధర్మాన్ని పాటించడం ఎంత అవసరమో మనకు విపులంగా చెప్పేది మహాభారతం. భారతంలోని ప్రతి పాత్రను నిశితంగా పరిశీలిస్తే మనకు ఏదో ఒకటి తెలుస్తుంది. ధర్మరాజు ధర్మనిరతికి ప్రతీకైతే దుర్నీతికి మరో రూపం దుర్యోధనుడు.

ధర్మమే సకల జగానికీ ఆధారం. ఈ విశ్వాన్ని ధరించినది ధర్మమే. అనేక అనుభవాలద్వారా కాలం మనకు చెప్పేది సంపూర్ణ ధర్మం. ధర్మం మనస్సును నియంత్రిస్తుంది. న్యాయమార్గంలోనూ, అందులోనూ అవసరమైనమేరకే సంపదనేకాదు దేనినైనా గడించమని చెప్పేది ధర్మమే. ధర్మంతోనూ, నీతితోనూ మనస్సు నియతమై ఉన్నప్పుడు అసూయాద్వేషాలతోపాటు కోపమూ, దురాశా వంటివికూడా మన దరిదాపుల్లోకి రావు.

అర్థ, కామ, సాధనలోని వేగాన్ని, నియంత్రించ గలిగేది ఒక్క ధర్మం మాత్రమే. సమాజ సంక్షేమానికి అదొక్కటే శ్రేయోమార్గం.

రాముడినీ, కృష్ణుడినీ ఆధారంగా చేసుకుని ధర్మాన్ని అర్థం చేసుకోవాలి. జీవితాలను అందంగా మలచుకోవడానికి తోడ్పడేది ధర్మమే. సనాతన ధర్మాన్ని ప్రజలకు పుణ్యమూర్తి. ధర్మానికి హాని కలిగి అధర్మం విజృంభించినప్పుడు ధర్మస్థాపనకోసం తాను అవతరిస్తానని శ్రీకృష్ణుడు చెప్పడం తెలిసిందేకదా.

ధర్మం వల్ల అర్థం, కోరికలు, ఉత్తమ గతులు లభిస్తాయి. అర్థకామ మోక్షములు, ధర్మం అనే పునాదిపైన ఆధారపడివున్నాయి. కనుక అన్నివిధాలా ప్రధానమైంది ధర్మమే.

యామిజాల జగదీశ్, హైద్రబాద్



బుజ్జాయి

ఎడిటర్ & పబ్లిషర్ : జి.ఎ.రావు



కన్నీటిని ప్రేరేపించే సాధనం!

పిల్లలూ! విజ్ఞానశాస్త్రరంగంలో రోజుకో పరికరాన్ని కనుగొనడం, కొత్త ప్రయోగాలు చేయడం మనకు తెలిసిందే. మానవాళికి ఉపయోగపడేదేదైనా ఎప్పటికీ మంచిదేకదా! అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఓ సరికొత్త పరికరాన్ని కనుగొన్నారు. అదేంటంటే కన్నీటిని ప్రేరేపించే ఓ బుల్లి ఎలక్ట్రానిక్ పరికరం. పొడిబారిన కళ్ళతో ఇబ్బందిపడే వారికిఇది ఉపశమనం కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సాధారణంగా కనిపించే కంటి రుగ్మత వీరి కార్నియాపైన కన్నీటిపొర లోపిస్తుంది. ఫలితంగా కార్నియా కంజంక్టువాలో ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ప్రపంచంలో దాదాపు అయిదారు శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. ప్రస్తుతం దీనికి సమర్థ చికిత్స లేదు. మెదడులోని స్పర్శ నాడుల నుంచి మెదడుకు అనుసంధానమై ఉన్న ఎఫరెంట్ నాడీ మార్గం వల్ల కన్నీటి ఉత్పత్తిని సమర్థంగా పెంచవచ్చని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. లాక్రిమల్ గ్రంధిని ప్రేరేపిద్దామని మొదట అనుకున్నారు. అయితే ఎఫరెంట్ నాడీ మార్గాన్ని ప్రేరేపించడం ద్వారా మరింత దీర్ఘకాలం ఉండే కన్నీటి స్పందనను కలిగించవచ్చని నిర్ధరించారు శాస్త్రవేత్తలు. ఈ ప్రేరేపణ కోసం బుల్లి పరికరాన్ని తయారుచేశారు. దీని పొడవు 16 మిల్లీమీటర్లు, వెడల్పు నాలుగు మిల్లీమీటర్లు. మందమేమో 2 మిల్లీమీటర్లు.

సంపుటి : 43 APRIL - 2018 సంచిక : 9

విడిప్రతి వెల : 20.00

సం॥ చందా రూ. 240.00





బభ్రువాహనుడు సామాన్యుడు కాడు!

మహాభారతంలో ఏ పాత్ర గొప్పతనం ఆ పాత్రదే. అయితే ఇక్కడ మనం బభ్రువాహనుడి గురించి తెలుసుకుందాం.

అర్జునునికి, చిత్రాంగదకు పుట్టిన కుమారుడే బభ్రువాహనుడు. సకల శాస్త్రాలు అభ్యసించిన బభ్రువాహనుడు విలువిద్యలో అత్యంత ప్రవీణుడు. అతనికి కౌరవులంటే మహాయిష్టం. అందులోనూ ముఖ్యంగా బభ్రువాహనుడికి కర్ణుడు, దుర్యోధనుడుపట్ల విశేషమైన గౌరవప్రపత్తులు ఉన్నాయి.

పాండవులు, కౌరవులమధ్య యుద్ధం జరగనున్నట్టు తెలుసుకున్న బభ్రువాహనుడికి తానూ ఆ యుద్ధంలో పాల్గొనాలనుకున్నాడు. బభ్రువాహనుడి కోరిక శ్రీకృష్ణుడికి తెలిసింది.

విలువిద్యలో ప్రవీణుడైన బభ్రువాహనుడు యుద్ధంలో కౌరవులవైపు ఉండి, వారి పక్షాన యుద్ధం చేసినట్లయితే పాండవులు ఓడిపోతారేమోననే సందేహం కలిగింది కృష్ణుడికి. కనుక అతనిని యుద్ధంలోకి రాకుండా అడ్డగించాలనుకున్నాడు కృష్ణుడు. బభ్రువాహనుని వద్దకు వెళ్ళి "నువ్వు ఎంతోగొప్ప వీరుడివి. శూరుడివి. విలువిద్యలో నీకు సమానులు లేరు. నిన్ను ఎవరూ ఎదుర్కోలేరు. నీ విలువిద్య నైపుణ్యతనూ, నీ సాహసాన్ని చూడడంకోసం నీ దగ్గరకు వచ్చాను" అన్నాడు కృష్ణుడు. ఆ మాటలకు బభ్రువాహనుడు పొంగిపోయాడు. కృష్ణుడు తన విలువిద్య శక్తిని చూడాలనుకుంటున్నాడా అని అనుకుని "దేవా, నా శరాన్ని దేనికి గురి పెట్టాలి?" అని అడిగాడు బభ్రువాహనుడు.

అంతట కృష్ణుడు ఓ పెద్ద చెట్టుని చూపించి "ఆ చెట్టుకు ఒక్క ఆకు కూడా లేకుండా అన్నింటినీ పడకొట్టి, నీ విలువిద్యా ప్రావీణ్యాన్ని నాకు చూపించు" అన్నాడు. మరుక్షణమే బభ్రువాహనుడు కృష్ణుడికి నమస్కరించి బాణం వదిలాడు. ఆ బాణం చెట్టుకున్న ఆకులన్నింటినీ కూల్చి వేసింది. అయితే కృష్ణుడు ఒక ఆకును మాత్రం తన పాదంతో ఆ ఆకు కనిపించకుండా కప్పాడు.

గురితప్పని బభ్రువాహనుని బాణం, కృష్ణుని పాదంవైపు దూసుకొచ్చింది. అది గ్రహించిన కృష్ణుడు వెంటనే తన పాదాన్ని పక్కకు తీసేశాడు. ఆ బాణం ఆ ఆకును కూడా కూల్చి వేసింది. బభ్రువాహనుని విలువిద్యా నైపుణ్యం, గురి చూసి బాణం వేయడంలోని అతని ఏకాగ్రతను కృష్ణుడు ప్రత్యక్షంగా చూశాడు. దాంతో కురుక్షేత్ర యుద్ధంలో బభ్రువాహనుడు ఎవరివైపు ఉంటే వారికి విజయం తథ్యమని తెలుసుకున్నాడు కృష్ణుడు.

బభ్రువాహనుడు "కృష్ణా, నా విలువిద్యను చూశారుగా. ఇప్పుడు చెప్పండి. నాకు కురుక్షేత్రయుద్ధంలో పాల్గొనే అర్హత ఉందా?" అని.

"నీ విలువిద్య అమోఘం. అద్భుతం. యుద్ధంలో పాల్గొనే అర్హత నీకు తప్పకుండా ఉంటుంది" అతని భుజం తట్టాడు కృష్ణుడు.

– ద్రైత పద్మావతి

ఆ మాటలకు పొంగిపోయిన బభ్రువాహనుడితో "ఎవరి పక్షాన యుద్ధం చేయాలనుకుంటున్నావు?" అని ప్రశ్నించాడు కృష్ణుడు.

"పాండవులకు మీరెలాగూ అండగా ఉన్నారు కనుక వారికి విజయం తథ్యం. అందువల్ల నేను కౌరవుల పక్షాన పోరాడుతాను. ఓడిపోయే వారి పక్షాన ఉండి యుద్ధంలో పాల్గొని వారి ఓటమిని విజయం దశకు మార్చాలని నా కోరిక. అంతేకాదు, కర్ణుని పట్ల నాకు పూజ్యభావమూ, గౌరవమూ ఉన్నాయి. దుర్యోధనుడన్నా ఇష్టం" అని జవాబిచ్చాడు బభ్రువాహనుడు.

కానీ కృష్ణుడు ఏదోవిధంగా అతను యుద్ధరంగానికి రాకుండా చూడాలని భావించాడు.

"బభ్రువాహనా, ఈ కురుక్షేత్రయుద్ధంలో జయాపజయాలు సమానం గానే ఉన్నాయి. కౌరవుల పక్షాన యుద్ధ నైపుణ్యాన్ని ప్రదర్శించే వీరులు ఎందరో ఉన్నారు. వారి వెంట అపరిమితసైన్యముంది. అలాగని పాండవులను తక్కువగా అంచనా వేయలేం.వారికికూడా గెలుపు లభించే అవకాశం ఉంది. నేను కురుక్షేత్రయుద్ధంలో కేవలం అర్జునుడి రథానికి సారథిగా మాత్రమే ఉంటున్నాను. వారికి నా సలహాలు ఇస్తానే తప్ప ఆయుధం పట్టుకోను. రెండు పక్షాలు సమ ఉజ్జీలే. గెలుపోటములు వారిరువురే తేల్చుకోవడం మంచిది. కనుక నువ్వు తటస్థంగా ఉండడమే మంచిది" అని సలహా ఇచ్చాడు కృష్ణుడు.


కృష్ణుడిమీది భక్తిభావంతో అందుకుసరేని అంగీకరించాడు బభ్రువాహనుడు. అయినా మనసులో తాను యుద్ధంలో పాల్గొనలేకపోతున్నానని నిరుత్సాహం చెందాడు బభ్రువాహనుడు. తాను యుద్ధంలో పోరాడలేకపోయినా ఇరు పక్షాల యుద్ధాన్ని, వారి బలాబలాలనూ చూసే అవకాశం ప్రసాదించమని కోరాడు బభ్రువాహనుడు.

అందుకు అంగీకరించిన కృష్ణుడు "అయితే, ఒక్క విషయం. రణరంగాన్ని మొత్తం నువ్వు చూసేలా నీ తలను తీయించి ఆ శిరస్సును ఒక పెద్ద వృక్షం మీద ఉంచితే నువ్వు యుద్ధాన్ని మొత్తం చూడగలుగుతావు. యుద్ధం పూర్తయ్యేంతవరకూ నీకు మరణం ఉండదు" అన్నాడు.

బభ్రువాహనుని శిరస్సు పాండవులు, కౌరవుల మధ్య జరిగే కురుక్షేత్ర యుద్ధాన్ని చూస్తూ అవసర సమయంలో కౌరవులకు సలహాలిస్తూ యుద్ధ వ్యూహాలను వారికి చెప్తూ వారు అధైర్యపడకుండా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ వారిని ప్రోత్సహిస్తూ కౌరవులను ఉత్సాహ పరచసాగింది బభ్రువాహనుని శిరస్సు.

అయినప్పటికీ కౌరవులు ఆ యుద్ధంలో అపజయం పాలవడంతో బభ్రువాహనుడు ఎంతగానో తల్లడిల్లి పోయాడు. ఉద్ధండులైన వారెందరో కౌరవుల పక్షాన ఉన్నప్పటికీ వారి ఓటమిని బభ్రువాహనుడు జీర్ణించుకోలేకపోయాడు. బభ్రువాహనుని కన్నీరే తమసానది రూపంలో ప్రవహిస్తోందని భక్తుల నమ్మకం.

బుడగ ఎలా ఏర్పడుతుంది ?




బుడగ చిన్నచిన్న నీటి చుక్కలతో ఏర్పడుతున్నది. ఈ నీటి చుక్కలు ఒక అద్భుతమైన శక్తి వలన కలుసుకొని ఉంటాయి. ఈ శక్తి ద్రవపదార్థాల అన్నిటి మట్టంమీదా పనిచేస్తుంది. దీని మహిమవల్ల నీటిచుక్కలు ఒకదానికొకటి కలుసుకుని విడిపోకుండా ఉంటాయి. ఈ నీటి చుక్కల సమూహమే ఒక పొరలాగ ఏర్పడుతుంది.

అందుకనే గ్లాసునిండా నీరున్నప్పుడు మట్టంమీద ఉన్న పొర నీటిని తొణికి పోనివ్వదు. అన్ని ద్రవపదార్థాలమీదా ఇటువంటి పొరలే వుంటాయి. కాని బుడగ అంటే అంతా పొరయే కదా, లోపల ఏమీ ఉండదు కదా ! లోపల ఉండే గాలి ఒత్తిడివలన ఈ పొర సాగుతుంది. గాలి ఒత్తిడి అన్నివైపులా ఉండటంచేతా జలకణాలు ఒకదాన్ని ఒకటి ఆకర్షించటంచేత ఈ పొర బెలూన్‌లాగా ఉబుకుతుంది.

కానీ ఈ బుడగలు ఎక్కువసేపు నిలిచివుండవు. ఏమంటే ఏ జలకణాల కలయికవల్ల ఇది ఏర్పడుతున్నదో అవి 'భూమ్యాకర్షణకు లోబడి ఉంటాయి. భూమ్యాకర్షణ వాటిని క్రిందికి లాగుతుంది. పైగా ఈ ఆకర్షణ పైన చెప్పిన అద్భుతశక్తికంటేకూడా బలవత్తరం కావటంవల్ల నీటి చుక్కలు కిందికి జారిపోతాయి. బుడగపొర పలుచబడిపోయి లోపల వుండే గాలి ఒత్తిడికి తట్టుకోలేక టపీమని పేలిపోతుంది.

జి. శ్రీనివాసరావు, చెన్నై



మూడు పరీక్షలు !

పవనపుర ప్రభువైన అపనింద్ర మహా రాజు నిండుకొలువులో ఉండగా ఒకనాడు రాజభటులు బక్కచిక్కిన ఒకనిని పెడ రెక్కలు విరిచితెచ్చి ఆయన ముందు నిలబెట్టారు.


'ఎవడురా వీడు?' అని గద్దించి అడిగాడు రాజు. 'జిత్తులమారి బాలయ్య ప్రభూ! ఈనాటికి దొరికాడు' అని భటులు జవాబిచ్చారు.

'ఉరిశిక్ష విధించాము. చింతచెట్టు కొమ్మకు వేలాడతీయండి!' అని ఆజ్ఞాపించాడు రాజు. 'ప్రభూ కరుణించాలి! 'అన్నాడు దీనంగా జిత్తులమారి బాలయ్య.

'తమరు రాజులుగనక ఖడ్గబలంవల్ల బ్రతుకుతున్నారు. నేను సామాన్యుణ్ణి గనక యుక్తిబలంవల్ల జీవిస్తున్నాను. ఏదో విధంగా బ్రతకాలికదా, ప్రభూ!' అంటూ జాలిగా వేడుకొన్నాడు బాలయ్య.

రాజు బాలయ్యతో 'నా కత్తికి ఈ లోకంలో ఎదురంటూ లేదు. మరి, నీ యుక్తి బలానికి కూడా ఎదురు లేదా !' అన్నాడు.

'లేదు ప్రభూ, లేదు !' అన్నాడు జిత్తులమారి బాలయ్య కొంతసేపాగి. 'ఓహో అలాగా! సరే నీ బుద్ధిబలాన్ని పరీక్షించేందుకు మూడు పరీక్షలు పెట్టబోతున్నాను' అన్నాడు రాజు.



'బుద్ధిబలం కలవాడికి అసాధ్యమైన పని అనేదే లేదు ప్రభు!' అన్నాడు బాలయ్య ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

రాజు ఆజ్ఞప్రకారం బాలయ్యకు కట్టు విప్పేశారు భటులు. రాజువాణ్ణి కోటబురుజు మీదకు తీసుకుపోయి దూరాన పొలం దున్నుతున్న ఒక రైతును చూపించాడు.

'ఆ రైతుకు తెలియకుండా అతడి కాడిఎడ్లను కాజేయాలి. ఇది మొదటి పరీక్ష' అని చెప్పాడు.

రాజువద్ద సెలవుతీసుకుని జిత్తులమారి బాలయ్య బయలుదేరాడు. పొలంపక్కనే ఉన్న అడవిలోపలికి చడీచప్పుడు లేకుండా జొరబడ్డాడు. అక్కడనే దాక్కుని గొంతెత్తి శ్రావ్యంగా పాడసాగాడు.

ఆ పాట చెవినపడేసరికి పొలం దున్నుకొంటున్న రైతు దున్నటం ఆపి అంత శ్రావ్యమైన పాట ఎక్కడి నుంచి వస్తున్నదా అని నలుమూలలా చూడసాగాడు. ఎవరూ కనపడకపోయేసరికి ఎడ్లను వదిలేసి తన్మయత్వంతో అడవిలోకి జొరబడ్డాడు.

ఇందుకోసమే ఎదురు చూస్తున్న జిత్తులమారి బాలయ్య అడవిలోనించి బయటపడి సరాసరి ఆ ఎడ్ల దగ్గరకు వచ్చాడు. మొలలోనుంచి కత్తితీసి ఆ ఎడ్ల తోకలూ, కొమ్ములూ కోసేశాడు. వాటిని అక్కడే భూమిలో కాస్త కాస్త బయటకి కనబడేట్టు పాతేసి ఆ మొండి ఎడ్లను అడవిలోకి తరిమేశాడు.


ఇంతట్లో రైతు అడవిలోంచి ఇవతలకు వచ్చాడు. ఎంత వెతికినప్పటికీ అడవిలో ఆ పాటపాడే మనిషి కనబడకపోయేసరికి, ఎవడో దారితప్పిన గంధర్వుడే ఆ గానం ఆలపించి వుంటాడనుకుని మనస్సు సరిపెట్టుకున్నాడు. ఇంతకంటే చేయగలదేముంది?' సరాసరి తను దున్నుతూవున్న చేను దగ్గిరకువచ్చి చూస్తే ఎడ్లు లేవు. కాని, భూమిలోపలనించి కొంచెం కొంచెంగా ఎడ్ల కొమ్ములూ, తోకలూ కనబడు తున్నవి.

ఏ కార్యాచరణ వల్ల ఎక్కువ మందికి తృప్తిని ఇవ్వగలుగుతామో అదే ఆనందానుభూతి

ఇంతలోకి జిత్తులమారి బాలయ్య కూడా అక్కడికే వచ్చాడు. ఏమీ తెలియనట్టు సంగతి ఏమిటని రైతును అడిగాడు. రైతు జరిగిందంతా చెప్పాడు. అందుకు బాలయ్య ఒకవేళ భూమిలోకి కూరుకుపోయినవేమో ! తోపట్టుకుని లాగరాదా?'అని సలహా ఇచ్చాడు.

పాపం ఆ రైతు బయటకి కనపడుతున్న తోకలు, కొమ్ములూ పట్టుకుని గుంజేసరికి అవి కాస్తా చేతుల్లోకి ఊడివచ్చినై. తన ఎడ్ల జత కిందవున్న ఏదో బురదగుంటలో దిగబడిపోయి వుంటుందనుకుని, దేవుడా అంటూ ఇంటికి మరలిపోయాడు. కోట బురుజు మీద నించుని యిదంతా కనిపెడుతూనే అవనీంద్రుడు బాలయ్య బుద్ధిబలాన్ని మెచ్చుకున్నాడు. కాసేపటికల్లా బాలయ్య వచ్చాడు. బాలయ్యా, నీ బుద్ధిబలం గొప్పదే ! రెండవ పరీక్ష విను. ఈ రాత్రికి మా గుర్రపుశాలలో పంచకళ్యాణిని ఎవరికీ తెలియకుండా తస్కరించాలి తెలిసిందా !' అన్నాడు రాజు.


బాలయ్య రాజుకు నమస్కరించి వెళ్ళిపోయాడు. రాజు వెంటనే గుర్రపుశాలలో కాపలావాళ్ళను పిలిచి 'యీ రాత్రికి చాలా జాగ్రత్తగా వుండాలి' అని హెచ్చరిక చేశాడు. బాలయ్య సరాసరి రాజభవనానికి వెళ్ళి సేనానాయకుడి దుస్తులు దొంగిలించాడు.



అవి తొడుక్కుని నడిరేయికల్లా గుర్రపుశాల దగ్గరకువచ్చి చూస్తే రాజుగారు కావలి వాళ్ళంతా అతిజాగ్రత్తగా ఉన్నారు.

ఒక అశ్వికుడు రాజుగారి పంచకళ్యాణి మీదనే కూర్చునివున్నాడు. పరిస్థితి తెలుసుకున్నాడు. బాలయ్య సరాసరి కాపలావాళ్ళ దగ్గరకు వచ్చి 'అబ్బాయిలూ! దొంగ దొరికిపోయాడు. ఇంత రాత్రివరకూ మీరు మేలుకుని జాగ్రత్తగా ఉన్నందుకు రాజుగారు ఎంతో మెచ్చుకున్నారు.

మిమ్మల్ని సరదాగా ఉండమని ఈ పానీయం బహుమతిగా పంపించారు' అంటూ వెంట తెచ్చిన షర్బతు బుడ్లు తలకొకటి వాళ్ళ




ముందు పెట్టాడు. జాగారం తప్పిందే చాలు ననుకున్న భటులంతా ఆ షర్బతుబుడ్లను అందినవి అందిన వెంటనే నోటికి తగిలించారు. అందులో ముందుగానే మత్తుమందు కలిపి తెచ్చిన జిత్తులమారి బాలయ్య. వాళ్లు తాగి కింద పడిపోగానే, రాజుగారి గుర్రాన్ని ఎక్కి బయటికి ఉడాయించాడు. కాసేపు అయిన తరువాత రాజుగారు అశ్వశాలకు వచ్చి చూస్తే పడి ఉన్న కాపలావాళ్ళు కనిపించారు. శాలలో గుర్రం లేదు. అంతగా ముందు జాగ్రత్తలు తీసుకున్నా, ఇంతమోసం జరిగిందేమిటీ అని అనుకొనేటంతలో గుర్రమీదినుంచి బాలయ్య రాజు గారి ఎదుట దిగాడు. రాజుతెల్లబోతూ 'బాలయ్యా ఇక ఆఖరు పరీక్ష చెబుతావిను.

రాణిగారి వేలి వుంగరాన్ని, ఆమె మేలు కొనివుండగా అపహరించగలిగితే నిన్ను క్షమిస్తాను' అన్నాడు. ఈ మాట చెప్పి రాజు సరాసరి అంతఃపురానికి వెళ్ళి రాణిపక్కనే కూర్చున్నాడు. పహారావాళ్ళను హెచ్చరించే వుంచాడు. గంటసేపయిన తర్వాత హఠాత్తుగా ఎవరో వస్తున్న అలికిడి అయ్యింది. పిట్టగోడ దగ్గరకు వెళ్ళి రాజు కిందకు చూశాడు. పిట్ట గోడవరకు ఒక నిచ్చెన ఆనించి వున్నది. ఆ నిచ్చెన మీది నుంచి ఎవరో మనిషి పైకి ఎక్కి రావటం కనిపించింది. ఇంకెవరు? జిత్తుల మారి బాలయ్యే అయివుంటానుకొని ఆ చీకట్లో సరిగా గుర్తించకుండానే రాజు నిచ్చెన ఒకచేత పట్టుకుని ఆ మనిషిని రెండోచేతితో నెట్టేశాడు.

అలా రాజు నెట్టివేసింది నిజమైన మనిషి కాదు. బాలయ్య సరిగా తనవంటిదే ఒక గుడ్డ బొమ్మ తయారుచేసి నిచ్చెనమెట్లమీదకు ఎక్కుతున్నట్లు బొమ్మను తాడుతో లాగుతున్నాడు. తను నిచ్చెనకు ఒక పక్కగా నించుని ఏంజరుగుతుందో అని వేడుక చూస్తున్నాడు. మనిషి అనుకున్న ఆ బొమ్మను కిందికి నెట్టివేయగానే రాజు మెట్టు దిగి వచ్చేశాడు.

అధికారాన్ని ఏ వ్యక్తుల చేతుల్లో ఉంచినప్పటికీ దాంతో వారు మంచినే చేయాలి

ఇది గమనిస్తూనే వున్నాడు బాలయ్య. రాజు అటు వెళ్ళగానే బాలయ్య మరొక వైపు నుంచి మెట్లెక్కి రాణిగారి అంతఃపురం చేరుకుని, చాటునదాగి మారుగొంతుకతో ఇలా అన్నాడు. పాపం అనుకున్నదంతా అయింది జిత్తులమారి బాలయ్యగాడు నిచ్చెనమీది నుంచి పడి చచ్చాడు. ఇక నీ వుంగరానికి ప్రమాదం ఏమీలేదు. అయినా కొన్నాళ్ళ వరకూ ఉంగరం పెట్టుకు నిద్ర పోవటం మంచిదికాదు. ఇటుతే దాచేస్తా' అన్నాడు. నిద్రమత్తులో ఉన్న రాణి ఈ మాట వినగానే తన వేలివుంగరాన్ని తీసి తెర పక్కనున్న బాలయ్య చేతికి ఇచ్చేసింది. ఆఉంగరం చేతపుచ్చుకుని బాలయ్య పరుగుతీశాడు. కాసేపటికల్లా రాజువచ్చి నిద్రలో ఉన్న రాణిని లేపి 'పాపం అను కున్నంతా అయింది, 'అని ఏమో చెప్పబోయే సరికి రాణి కళ్ళు తెరిచింది. 'అస్తమానం అదేమాటా ! ఇప్పుడే కదూ నా వేలివుంగరం తీసి పట్టుకెళ్ళారు?' అన్నది విసుగ్గా. 'ఇదేమిటి ? ఉంగరమా !! ఉంగరం ! అన్నాడు రాజు తెల్లబోతూ. వెంటనే జిత్తుల మారి బాలయ్య ఎత్తు తెలిసిపోయింది రాజుకు. తెల్లవారగానే జిత్తులమారి బాలయ్య రాణిగారి ఉంగరంతోసహా రాజుగారి దగ్గరకు వచ్చాడు. రాజు నవ్వుతూ 'బాలయ్యా ! నీ బుద్ధిబలం సాటిలేనిదని తేలిపోయింది. నీ ఉరిశిక్ష రద్దుచేస్తున్నాను. 'జిత్తులమాన్యం ' అన్న పేరుతో నీకు పది ఎకరాల పొలం ఇచ్చాను. హాయిగా బ్రతుకు. పో ! ' అన్నాడు. 'ప్రభువుల దయ..' అంటూ చేతులు జోడించి రాజుకు నమస్కరించాడు జిత్తులమారి బాలయ్య. బాలయ్య తన యుక్తివల్ల సంపాదించుకున్న జిత్తుల మాన్యం ఈనాటికీ అనుభవిస్తూ సుఖంగా ఉంటున్నాడు.



ఎంతవడిగా నడవగలవు ?


ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే ఒక సులువైన మార్గమున్నది :

ఎనభై లేక వందగజాల పొడవుగల సన్నటి దారం తీసుకో. ఒక సీసం ముక్క గాని, బరువైన లోహపు ముక్కగాని, లేదా రాయైనా సరే తెచ్చి ఆ దారానికి ఒక చివరని కట్టు. అలా కట్టిన బరువుకు 44 అడుగుల దూరంలో ఆనవాలు కోసం ఒక ముడి వెయ్యి. లేదా మడత పెట్టినా సరే. అక్కడి నుంచి మళ్ళీ 44 అడుగుల దూరంలో పైమోస్తరుగానే మళ్ళీ ఒక ఆనవాలు పెట్టి అలానే దారం పొడుగునా ప్రతి నలభైనాలుగేసి అడుగుల దూరంలోనూ ఒక్కొక్క ఆనవాలు పెట్టుకొంటూ వెళ్ళు. అనగా, మొత్తం వందగజాల పొడవుగల దారానికీ, ప్రతీ నలభై నాలుగేసి అడుగుల దూరంలోనూ ఒక్కొక్క అనవాలు ఏర్పడి వుంటున్నది. అటుతరువాత సెకన్లు ముళ్ళుగల వాచీ చేతపట్టుకో.

ఇప్పుడు మొదట బరువు కట్టిన దారపు కొనని కిందపెట్టి దారం చేతిలోనే పట్టుకొని మామూలుగా నడువు. నీ చేతిలో నుండి దారపు ముళ్ళు ఒక్క అరనిమిషంలో ఎన్ని జారిపడతాయో అన్ని మైళ్లు నీవు ఒక గంటలో నడిచినట్టు అన్నమాట. ఎలా అంటే ఒక మైలుకు 5280 అడుగులు.

ఈ సంఖ్యను 44 పెట్టి భాగిస్తే 120 వస్తుంది. అనగా 5280 (లేక ఒక మైలు) లో 44 నూటయిరవయ్యో భాగమని తెలుస్తుంది. అలానే ఒక గంటకు నిమిషాలు 60. లేదా అర నిమిషాలు 120. ఒక గంట కాలంలో అరనిమిషం 120వ భాగం. దీన్నిబట్టి తెలుస్తున్నదేమిటంటే : ఒక గంటలోనే 120వ వంతు కాలంలో ఒక మైలులోని 120వ వంతు దూరం నడవగలగుతున్నారన్నమాట.

ఎ. లతికశ్రీ - చెంగల్పట్టు



వితండుడు !

ఒకానొకప్పుడు ఒక అరణ్యంలో వితండు డనే పేదవాడు ఉండేవాడు. వితండుడు అమాయకుడు. అతను తన రెక్కలకష్టం మీదనే గంపెడు సంసారాన్ని ఈదుకు రావలసి ఉండేది. చీకటితోనే లేచి గొడ్డలి భుజాన వేసుకొనిపోయి అడవిలో కట్టెలు కొట్టి తేవటం, ఆ తెచ్చిన మోపు ఊరిలో అమ్ముకుని కాలక్షేపం చేయటం ఇది అతని నిత్యకృత్యం.

ఇలానే ఒకనాడు వితండుడు కట్టెలు కొడుతూవుండగా ఆ దారినపోయే ఒక సాధువు వానిని చూచాడు. కష్టజీవి అయిన వితండుణ్ణి చూడగానే ఆ సాధువుకు కనికరం వేసింది. వితండుణ్ని పిలిచి 'నాయనా!' నీవెవరవు? నీ పేరేమిటి?' అని అడిగాడు.

అందుకు వాడు 'అయ్యా !– నాపేరు వితండుడు. కట్టెలు కొట్టి జీవించటమే నా వృత్తి ' అని చెప్పాడు. సాధువు నవ్వుతూ 'వితండుడా ! వితండుడా ! –భేష్ ! బాగుంది పేరు.' అని, కొంచెంసేపు ఆలోచించాడు. కుశలప్రశ్నలయిన తరువాత 'నాయనా!– లోకమే మరచి, సంసారం కోసమని ఇంత తాపత్రయపడుతున్నావే, నీ మనస్సులో ఎన్నడైనా దేవుని గురించి ఆలోచిస్తూ ఉంటావా ? ' అని ప్రశ్నించాడు. 'దేవుడా ! ఎవరాయన ? నే నెరిగిన బంధువులలోగాని, స్నేహితులలోగాని ఈ పేరుగలవాళ్ళు లేరే ! ఐనా, గంపెడు సంసారంతో సతమ తమయ్యే నాకు వాళ్ళను గురించి వీళ్ళను గురించి ఆలోచించే తీరిక యెక్కడస్వామీ ?' అని


జి. సుబ్బలక్ష్మీ – నెల్లూరు



బదులు చెప్పాడు. ఈ జవాబు వినేసరికి వితండునిమీద సాధువుకు ఆశ్చర్యమూ వేసింది, కోపమూ వచ్చింది. ఐనా తటపటాయించి 'అబ్బాయి ! నీవు దేవుడి పేరే వినలేదా ? వింతగా ఉన్నదే ! నిన్నూ నన్నూ, ఈ చెట్లుగట్లూ పుట్టల్నీ ఆ దూరాన కనబడే కొండలనూ సముద్రాలనూ మన కంటికి కనిపించే సమస్తమైన వస్తుజాలాన్ని సృష్టించిన ఆ మహానుభావుని పేరే వినలేదా? - హహ్హహ్హహ్హా !! " అంటూ పకపక నవ్వాడు. ఇలా మాటాడి, సాధువు నవ్వేసరికి వితండుడికి తనేదో గొప్ప నేరం చేసినట్టు అనిపించింది. కాళ్ళమీదపడి, తరుణోపాయం సెలవీయమని ప్రాధేయపడ్డాడు. అప్పుడు సాధువు వితండుడిని లేవదీసి 'నాయనా ! -మానవజన్మ ఎత్తినందుకు మోక్షం పొందటమే సార్థకం. మోక్షం పొందాలంటే తపస్సు చేయాలి. అలా చేయకపోతే మనం మరణించిన తరువాత మళ్ళీ ఏ కుక్కగానో, కాకిగానో పుట్టవలసి వస్తుంది సుమా !' అని అనేక విధాల బోధ చేశాడు. వితండుడు కాళ్ళావేళ్ళాపడ్డాడు. ఈ దేవుడి గొడవ జొరపబడి అతని హృదయంలో నానా చికాకూ కలగసాగింది.

సాధువు ముమ్మారు దీవించి తనదారిన వెళ్ళిపోయాడు. వితండుడు కట్టెలమోపు నెత్తినపెట్టుకుని బరువెక్కిన హృదయంతో కాళ్ళీడ్చుకుంటూ గ్రామానికి బయలుదేరాడు. ఆ రోజున కట్టెలు అమ్మగా వచ్చిన డబ్బులు భార్యచేతిలో పెట్టి వితండుడు దైవధ్యానంలో మునిగిపోయాడు. భర్తలో వచ్చిన ఈ మార్పు చూచి వితండిడి భార్య మొదట్లో ఆశ్చర్యపడింది. కాని మరునాటి ఉదయం అడవికి పోకుండా దైవప్రార్థనలోనే మునిగి ఉన్న అతడిని చూసేసరికి విపరీతమైన కోపం వచ్చిందామెకు. 'వేళయింది. గొడ్డలి భుజానవేసుకుని అడవికి పోవేం !' అన్నది ఆమె. 'ఉహు ! పోను. నా ఆత్మగతి

ఏంకావాలి? నేను అడవికి పోతే దేవుడి సంగతేమిటి ? ' అని గద్దిస్తూ, అర్థం అయినాకాని ఆసాధువు మాటలను ఏకరువు పెట్టాడు. అతని భార్య అప్పటికి ఊరుకుంది. ఒకటి రెండురోజులు గడిచాయి. కాని వితండుడు కాలమంతా దైవప్రార్థనలోనే గడపసాగాడు. ఇంట్లో చిట్టెడు గింజలుకూడా లేవు. పిల్లలు ఆకలితో అటమటించి పోతున్నారు. భర్త ధోరణి ఇక ఏ మాత్రం సహించలేక, వితండుడి భార్య తిట్ల పారాయణ ప్రారంభించింది. 'ఛీ' అనుకొన్నాడు వితండుడు. 'దైవప్రార్థనకైనా అవకాశంలేని ఈ పాడుకొంపలో ఉండటం ఎందుకు ? ' అని ప్రశ్నించుకున్నాడు. విరక్తి చెందిన సరాసరి కొండలకేసి బయలుదేరాడు. అక్కడికి దగ్గరలోనే మంత్ర పర్వతాలు అనే పెద్ద కొండలవరస ఉన్నది. రాత్రిళ్ళే కాదు, పట్టపగలు సైతం ఆ కొండలమీదికి ఎవరూ వెళ్ళరు. అక్కడ పిశాచాలో, గంధర్వులో మసలుతూవున్నట్టు లోకులు చెప్పుకునేవారు.



దైవప్రార్థనలో మైమరచి ఉన్న వితండుడు సరాసరి ఆ మంత్రపర్వతాల మీదికే వెళ్ళిపోగలిగాడు. దట్టంగా ఉన్న చెట్లమీద, చిక్కగా అల్లుకుపోయిన కొండతీగెలతో, చల్లగా చీకటిగా ఉన్న ఒక ప్రదేశంలో కూర్చున్నాడు. మరి కాసేపటికల్లా దైవ ప్రార్థనలో నిమగ్నుడయ్యాడు. అలా ఎంత కాలం గడిచిపోయిందో చెప్పలేము. ఒకనాడు, దైవప్రార్థనలో నిశ్చలంగా కూర్చుని ఉన్న వితండుడికి దగ్గరలోనే ఏదో శబ్దం వినిపించినట్టయింది. అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మల్ని అవతలికి తొలగించిచూశాడు. ధగధగమనే వస్త్రాభరణాలతో, నిగనిగమనే శరీరకాంతితో, మిరుమిట్లు కొల్పుతున్న ఇద్దరు కన్యలు – అక్కడ పచ్చికమీద కూర్చుని పచ్చీసు ఆడుకుంటున్నారు. చూస్తున్నాడు వితండుడు. సర్వం మరచి పచ్చీసు ఆడుకుంటున్న ఆ కన్యలు ఎవరో ! వితండుడికి ఈ సందేహమే కలగలేదు. వారి



వచ్చీనను ఆటలో తనూ భాగస్వామి అయిపోయాడు ! ఆట మంచి పసందుగా సాగిపోతూ ఉంది. గడులలో నుంచి పైకి కిందికి, ప్రక్కలకీ కన్యలిద్దరూ కదిలిస్తున్న ప్రతీ గవ్వకేసి గుచ్చిగుచ్చి చూస్తున్నాడు వితండుడు. హఠాత్తుగా ఒకామె పొరపాటుగా గవ్వను పైకి కదిలించబోయింది. ఆ ఎత్తుగడ తప్పు అని వితండుడికి తెలుసు. 'అమ్మాయ్, ఆ ఎత్తుగడ తప్పు ! ఆ గవ్వను కదిలించకు ' అనేశాడు అప్రయత్నంగా వితండుడు. కన్యలిద్దరూ భయకంపితులై, వితండుడికేసి చూశారు. మరుక్షణానే లేళ్ళుగా మారి చెంగున ఎగురుతూ పారిపోయాడు. ఆ దృశ్యం చూసేసరికి వితండుడికి కలలోంచి మేల్కొన్నట్టనిపించింది. కొంపా గోడూ, పెళ్ళాం బిడ్డలూ అంతా గుర్తుకొచ్చి ఒక్కసారి చూసివద్దాం అనుకుని బయలుదేరాడు. కాసేపటికల్లా కొండదిగువకు వచ్చేశాడు. దాహమైంది. అక్కడ చిన్న కొలనుదగ్గిరకు వెళ్ళా దాహం తీర్చుకునేందుకు నీళ్ళకోసం కిందికి వంగేసరికి, నీటిలో ఒక వృద్ధుని స్వరూపం కనిపించింది. !! వితండుడికి భయం పుట్టింది. 'అంతా మాయ ! అసలీ పర్వతాలే మాయ ! ' అనుకొన్నాడు వితండుడు. అతను దాహం తీర్చుకుని తన ఇల్లు ఉండే చోటికి వచ్చాడు. కాని అక్కడ తన ఇంటి ఆనవాలే కనబడలేదు. సంసారం ఏమైందా అని ఆలోచనలో పడ్డాడు వితండుడు. అంతలో నీలాటిరేవు నుండి కడవ భుజానవేసుకునిపోతున్న ఒక స్త్రీ అతడికి ఎదురువచ్చింది. 'అమ్మా ! ఇక్కడ వితండుడు అనే ఒక కట్టెలవాడి భార్య, బిడ్డలూ ఉండేవారు కదా, ఆ సంగతి నీకేమైనా తెలుసా ? ' అని అడిగాడు. ఆ స్త్రీ వితండుడికేసి అతి ఆశ్చర్యంగా చూసింది. తరువాత పకపకా నవ్వుతూ 'నాయనా ! ఈ ప్రాంతంలో మూడు తరాల కిందట వితండుడనే కట్టెలవాడు భార్యాపిల్లలతో

ఉండేవాడనీ, సంసారమందు విరక్తి కలిగి మంత్రపర్వతాలమీదికి పోయాడనీ, మా ముత్తావ చెబుతూ ఉండేది. అంతకన్నా నాకేమి తెలియదు ' అన్నది. ఆ మాటలతో వితండుడికి అంతా అర్థమైపోయింది. ఒకసారి శరీరం కేసి చూసుకున్నాడు. ముడతలు పడి ఉంది. మోకాళ్ళ వరకు తగులుతూంది తెల్లటిగడ్డం. ఆనాడు కొలనులో కనబడిన ఆ వృద్ధుని ప్రతిబింబానికి తన స్వరూపానికీ తేడా ఏమీలేదు ! శరీరంలో పటుత్వం సడలింది. ఆయాసపడుతూ, ఒక చెట్టుమొదట కూలబడ్డాడు. అతనికేసి జాలిగా చూసిన ఆ స్త్రీ అక్కడి నుంచి వెళ్ళిపోబోతున్నది. ఆగమని సంజ్ఞ చేశాడు వితండుడు. ఆమె ఆగింది. అప్పుడతను ' నా మాట ఒక్కటి ఉంది. ఈ మాటను మీ గ్రామంలోనే కాదు, వీలైన చోటల్లా వ్యాప్తి చేయాలి ' అన్నాడు. 'ఏమిటది ?' అని అడిగింది ఆ స్త్రీ వింతగా చూస్తూ. అందుకు వితండుడు 'దైవప్రార్థనలో మునిగి భార్యాబిడ్డల్ని, సంసారాన్ని మరిచిపోకూడదు. ఇది మహాపాపం! ఇలాంటి వాళ్ళు రాబోయే జన్మలో కుక్కలుగానో, కాకులుగానో పుట్టితీరుతారు. ఇదే నా మాట ! ' అని చెప్పి ఆ చెట్టు మొదటనే ప్రాణం విడిచాడు. కాసేపటికల్లా గ్రామ ప్రజలు తండోప తండాలుగా వచ్చి వితండుడి వింత చరిత్ర అంతా తెలుసుకోసారు.





కోటలో కుక్కలు

బ్రహ్మదత్తుడు కాశీరాజ్యాన్ని పరిపాలన చేసేకాలంలో ఒకప్పుడు బోధిసత్త్వుడు రుద్ర భూమిలో శునకంగా జన్మించి, వందల కొలది కుక్కలు గల ఒక పెద్ద మందకు పెద్దగా ఉంటూవచ్చాడు.

ఒకరోజున రాజు మేలు జాతి తెల్లటి గుర్రాలను పూన్చిన తన అందాల గుర్రపు సారటుమీద విహారం కోసమని వెళ్ళి, సూర్యాసతమయం అయేసరికల్లా మళ్ళీ కోటకు చేరుకున్నాడు. చేరుకొన్న తరువాత గుర్రపు సారటును పెరట్లో విప్పి వదిలేశారు పరిచారకులు. ఆ రాత్రి పెద్ద వర్షం కురిసి, సారటు పూర్తిగా తడిసిపోయింది. పైగా రాజుగారి కుక్కలు మేడదిగి వచ్చి, సారటుకు ఉండే తోలు సామగ్రినంతటినీ కొరికి ముక్కలు చేసినై. మరునాడు పరిచారకులు రాజుద్దకు పోయి 'ప్రభూ ! – కుక్కలు వచ్చి మన సారటుబండి సామగ్రినంతటినీ కొరికి పోగులు పెట్టినై ' అని ఫిర్యాదు చేశారు. ఆ మాట వినటంతోనే రాజుకు కుక్కల మీద కోపం వచ్చింది. 'వెధవ కుక్కలు, కంటబడిన కుక్కనల్లా పట్టి చంపేయండి' అని ఆజ్ఞ ఇచ్చాడు. రాజు ఇలా ఆజ్ఞ ఇవ్వగానే రాజ్యంలో కుక్కలవధ ప్రారంభమయ్యింది. కనబడిన కుక్కనల్లా రాజుగారి తలారి వాళ్ళు పట్టి చంపుతూ వచ్చారు. ఈ గొడవ ఎక్కువకాగానే, రాజ్యంలో కుక్కలన్నీ కలిసి బోధిసత్త్వుడు ఉండే రుద్రభూమికి వెళ్ళినై. 'ఏమిటి ? మీరందరూ ఎందుకిలా పరుగెత్తుకువచ్చారు? ' అని అడిగాడు బోధినత్త్వుడు ఆత్రంగా. 'ఏలికా ! ఇంకేముంది ? మనజాతిని నాశనం చేసే మునలం పుట్టిందిప్పుడు. రాజుగారి గుర్రపుసారటమీది తోలు ముక్కలను ఏవో

ధనరాజు – తిరుపతి



తెలియగానే ప్రభువులు మండిపడి కుక్కజాతినే కంటపడకుండా నిర్మూలం చేయమని ఆజ్ఞ ఇచ్చారట.' అని విన్నవించుకున్నాయి ఆ కుక్కలు. అప్పుడు బోధిసత్వుడు ఇలా తలిచాడు. 'బయటనుండే కుక్కలు కోటలోపలికి వెళ్లటానికి ఎంతమాత్రమూ సాధ్యపడదు. ఎలా అంటే అహోరాత్రులు పారావాళ్ళు కాపలా కాస్తూనే వుంటారు. కనుక, ఇది కోటలో ఉండే కుక్కలు చేసిన పనేకాని, వేరేమికాదు. ఈ మాట నిజం. పోతే నేరం చేసిన కుక్కలు బాగానే ఉన్నాయి. ఏ పాపం ఎరుగని నా కుక్కలు నిష్కారణంగా బలి కావలసి వచ్చింది. ఇలా ఊరుకుంటే ఎలాగ? నేరం చేసిన కుక్కలు ఏవో కనుక్కొని, రాజుకు పట్టి ఇచ్చి, నా కుక్కలను నేను రక్షించుకోవటం పాడికదా !' ఇలా తలిచి బోధిసత్వుడు తన కుక్కలతో 'మీరేమి భయపడకండి. మిమ్మల్ని రక్షించే భారం నాది. నేను రాజువద్దకు పోయి వస్తా. నేను వచ్చేవరకు మీరిక్కడే వుండండి! ' అని చెప్పి సముదాయించాడు. సముదాయించి బోధిసత్వుడు తన మనసులో 'ధర్మం జయించుగాక ! రాజు న్యాయం పాలించుగాక ! ' అని అనుకుంటూ బయల్దేరాడు. అలా కోటకు వెళుతున్న ఆ కుక్కను చూసి రాజభటులెవ్వరూ ఒక్క రాయి అయినా దాని మీద విసరలేదు. కోపగించుకోనూలేదు. అక్కడ కంటబడిన కుక్కలన్నిటిని చంపమని ఆజ్ఞ ఇసత్తానే రాజు వచ్చి దర్బారులో న్యాయస్థానమందు ఆసీనుడయ్యాడు. అప్పుడు బోధిసత్వుడు అనే శునకం సింహాసనం కిందినించి దూరి వచ్చి, రాజు ఎదుట నిలబడింది.

రాజుగారి పరివారం ఆ కుక్కను పట్టుకోబోయారు. కాని, పట్టవద్దు అని రాజు వారిని ఆటంకపరిచాడు. బోధిసత్వుడు రాజుకు వినయంగా నమస్కరించి 'ప్రభూ ! – కుక్కలన్నింటినీ చంపివేయమని


పెళ్లయిన మర్నాడే, హటాత్తుగా తన వయస్సు ఏడేళ్లు పెరిగిపోయినట్లు భావిస్తాడు పురుషుడు



సామగ్రి పాడు చేయటం చేతనే కుక్కజాతిని నాశనం చేసి వేయమన్నాము ' అని చెప్పాడు రాజు. 'ఐతే మీ పరిచారకులు కుక్కలన్నింటినీ చంపుతారా, కొన్నిటిని వదలిపెడతారా ? ' అని మళ్ళీ ప్రశ్నించాడు బోధిసత్వుడు. 'అన్నిటినీ చంపరు. మా కోటలో వుండే ఉత్తమజాతి శునకాలను తాకరు ' అని చెప్పాడు రాజు. అప్పుడు బోధిసత్వుడు ఇలా అన్నాడు. ' ప్రభు! ఇప్పుడేకదా తమరు 'మా సారటు సామగ్రి కొరికివేయటంచేత కంటబడిన కుక్కనల్లా చంపివేసి కుక్కజాతినే నాశనం చేయవలసిందని ఆజ్ఞాపించాము ' అని సెలవిచ్చారు? మళ్లీ తమరే సెలవిస్తున్నారేమిటి ' మాకోటలో కుక్కలను మాత్రం తప్పించి ' అని ? దీన్నిబట్టి చూడగా దేవరవారికి పక్షపాతం, ద్వేషం, అవివేకం, భయం అనే నాలుగు అవగుణాలు పట్టినట్టుగా కనబడుతున్నది. ఇవి ఎంతమాత్రమూ రాజలక్షణాలు కావు. న్యాయవిచారణ చేసే ప్రభువులు నిష్పాక్షికంగా వుండాలి. కానీ, ఇప్పుడు తమ ఆజ్ఞ వల్ల కోటలో కుక్కలు మట్టుకు సురక్షితంగా ఉండటం, ఏ పాపమూ ఎరుగని ఊరి కుక్కలన్నీ నిష్కారణంగా బలికావటం జరుగుతున్నది. న్యాయం ఎంతమాత్రమూ

'అవును ' అన్నాడు రాజు. ' అవి చేసిన తప్పేమిటి, రాజా ? ' అని మళ్ళీ అడిగాడు బోధిసత్వుడు. ' మా ఆస్థానపు సారటుకు గల సామగ్రిని కొరికివేసినై ' అని చెప్పాడు రాజు. 'సరే ఆ కొరికిన కుక్కలేవో తమకు ఆనవాలు తెలుసా ?' అని ప్రశ్నించాడు బోధిసత్వుడు. 'తెలియదు ' అన్నాడు రాజు. 'మరి నేరం చేసిన కుక్కలేవో తెలుసుకోకుండా కంటబడిన కుక్కలన్నింటినీ చంపి వేయమనటం న్యాయమేనా ! నిరపరాధులను నిష్కారణంగా చంపటమేనా ధర్మం ? ' అని అడిగాడు బోధిసత్వుడు. ' మా సారటు

ప్రేమ యుద్ధం లాంటిది. మొదలు పట్టడం ఎంతో సులభం. ముగించడం చాలాకష్టం



పాలింపబడటంలేదు. అదుగో 'ప్రభువు న్యాయం పాలించటంలేదు' అని ఆకాశవాణి కూడా పలుకుతున్నది. విను రాజా ! –

కోట కుక్కలూ కూటికి లేక
కాళ్ళావేళ్ళాపడుతుంటే
దోషమెరుగని ఊరికుక్కలూ
బలి ఐపోతున్నయ్ ! '


రాజా ! ఇదా నీ న్యాయం ?

ప్రభూ ! – ఇదా నీ ధర్మమా ? –'


ఈ మాటలు వినేనరికి రాజు హృదయంలో గొప్ప మార్పు వచ్చింది. 'మరైతే మ సారటు సామగ్రి పాడు చేసిన కుక్కలు ఏవో నీ బుద్ధిబలం ఉపయోగించి చెప్పగలవా ? ' అని అడిగాడు. అందుకు బోధిసత్వుడు 'చెప్పలేకేం?' అంటూ ' మనకోటలో ఉం టున్న మేలు జాతికుక్కలే ! ' అని చెప్పాడు బోధిసత్వుడు. 'అదేంమాట ? ' అన్నాడు చికాకుతో రాజు. ' కావలిస్తే ఋజువు చేయగలం ప్రభూ ! అన్నాడు అందుకు. ఏదీ చెయ్యి చూతాం అన్నాడు రాజు. కొంచెం మజ్జిగ, గరికపోచలూ తెప్పించి కోటలోని కుక్కలను రప్పించమన్నాడు బోధిసత్వుడు. ఆయన నలహాప్రకారం మజ్జిగలో గరికపోచలు ముక్కలు చేసి పడవేసి ఆ కుక్కలకు పట్టించాడు. వెంటనే ఒక్కొక్క కుక్క వాంతి చేసుకోవటం ప్రారంభించి అవి మింగిన తోలుముక్కలన్నీ ఒక్కటి మిగలకుండా బయటపడినై. 'రాజా ! తెలిసిందా ఇప్పుడు ? నీ పనివాళ్ళు మీ కుక్కలకు ఆహారం సరిగా పెట్టకపోవటంచేత, కడుపుమాడి అవి తోళ్ళు కొరుక్కుతిన వలసివచ్చింది' ని చెప్పాడు బోధిసత్వుడు. రాజు పరమానందభరితుడై, ఈయన శునకరూపంలో ఉన్న బోధిసత్వుడు తప్ప వేరెవ్వరూ కాదు ' అనినిశ్చయించి తన ఛత్రం బోధిసత్వునికి పట్టించాడు. అప్పుడు బోధిసత్వుడు 'రాజా !– న్యాయపరిపాలన చేయటమే రాజు లక్షణం' అని చెబుతూ

ఇంకా అనేక రాజధర్మాలు ఉపదేశించాడు. ఈ బోధలు విన్న తరువాత రాజు, ప్రతి జీవిని దయగా చూడవలసిందని పరివారానికి చెప్పాడు. ఆనాటి నుంచీ కోటలో ఉండే కుక్కలకే కాక, రాజ్యంలోని కుక్కలన్నిటికీ రాజు ముప్పొద్దులా తగిన ఆహారం పెడుతూ, కావలసిన సదుపాయాలన్నీ అమర్చమని ఆజ్ఞాపించాడు. కుక్కల విషయంలో కాదు, బోధిసత్త్వుని బోధలు ఎల్లప్పుడు వింటూ రాజు తన జీవితంలో అనేకమైన మంచి కార్యాలు చేసి, కైవల్యం పొందాడు. ఈ విధంగా శునకరూపంలో బోధిసత్త్వుడు పదివేల సంవత్సరాలపాటు లోకానికి ఉపదేశాలు చేసి, ఎంతోమందికి తరుణోపాయం చూపించి ధన్యుడయ్యాడు.


(లేఖతో సహా భీమవర్మ వద్దకు వెళ్లిన విజయవర్మ తిరిగి వస్తూ త్రోవలో పురుషరూపంలో పారిపోతున్న కరుణను కలుసుకొన్నాడు. యుద్ధంలో భీమవర్మ పక్షం ఓడిపోయింది. భీమవర్మ మారువేషంతో ప్రాణాలు దక్కించుకొని పారిపోయాడు. అక్కడ శత్రువులు పెచ్చరిల్లుతారు. భీమవర్మ ఆజ్ఞప్రకారం విజయవర్మ కరుణను గిరికోట చేరుస్తాడు. ఇక...)



అదృష్టం గానీ, ప్రేమగానీ ధైర్యం గలవారికే దక్కుతాయి



గిరికోట తిరిగి వెళ్ళిన విజయవర్మకు అక్కడి జనమంతా చాలా నిస్పృహగా కనిపించారు. యుద్ధంలో ఓడిపోవటం, పైపెచ్చు శబ్దవేధి దుండగాలూ ! కోటలో ప్రవేశించిన కరుణాకరుడు మరి కనబడలేదు. తన తండ్రి చావును గురించి అతను అన్నమాటలు విజయవర్మ మనస్సులో మెదులుతూనే ఉన్నాయి. ఏమీ తోచక అతను రాంసింగును అడిగాడు. రాంసింగు ఒక్కక్షణం అతని వంక తీవ్రంగా చూచి 'నాకీ విషయాలు తెలియవు. నీవూ ఇలాంటి విషయాలు పట్టించుకోకపోవటమే మంచిది. కాదంటావా సోమవర్మగారిని అడుగు ' అన్నాడు. మారుమాటాడకుండా విజయవర్మ వెళ్ళిపోయాడు. భీమవర్మ తన సైనికులకు ధైర్యం చెప్పి బీసల్పూరు సామంతులలో ఒకడైన దేవదుర్గాధిపతికి ఒక లేఖ పంపించాడు. అతడీ విధంగా రంగు మార్చటం ఎవరికీ ఆశ్చర్యం కలుగలేదు. అతనికిది అలవాటే. విజయవర్మ తిన్నగా సోమశర్మగారి వద్దకు వెళ్ళి రాంసింగును అడిగిన ప్రశ్న మళ్ళీ అడిగాడు. సోమవర్మ 'ఇదివరకొకసారి చెప్పలేదా ' అనేసి వెళ్ళిపోయాడు. విజయవర్మకు తృప్తి కలగలేదు. ' ఈ విషయం ఇంకెవ్వరిని అడుగుదామా ' అనుకొనేటంతలో భీమవర్మగారు పిలుస్తున్నారని చెప్పాడు ఒక సేవకుడు. విజయవర్మ వెళ్ళేటప్పటికి భీమవర్మ తన గదిలో కోపంగా పచారుచేస్తున్నాడు. పక్కన సోమశర్మ తప్ప




కాదు నేను. కానీ నా తండ్రి చావు గురించి రకరకాల గాలికబురులు వినవస్తున్నయ్. సత్యమేమిటో తెలుసుకొనేవరకు నాకు స్తిమితం చిక్కదు' అని విజయవర్మ గట్టిగా సమాధానమిచ్చాడు. 'అయితే విను. భగవంతుని సాక్షిగా చెబుతున్నాను. మీ తండ్రి చావుతో నాకెట్టి ప్రమేయం లేదు. నా మాట నమ్మకముంటే అనుమానం రద్దు చేసుకో. లేదా, కోట బయట అరణ్యంలో నా శత్రువులెంతమందో ఉన్నారు. నీవు కూడా వారిలో కలిసిపో' అని భీమవర్మ ఒట్టువేసుకునేసరికి విజయవర్మకు పూర్తిగా సంతృప్తి కలిగింది. అతను సంతోషంగా సోమశర్మవైపు తిరిగాడు. కాని సోమశర్మ ముఖం చూచి అతనికి అంతులేని ఆశ్చర్యం కలిగింది. అతని ముఖంమీద కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. భయంతో నిలువునా వణికిపోతున్నాడు. విజయవర్మ మళ్ళీ అనుమానంతో సోమశర్మగారుకూడా ఒట్టు వేసుకుంటే ? ' అన్నాడు. 'ఎందుకు వేసుకోడు? నేరం చెయ్యని వాడికేం భయం ? వేసుకోవయ్యా ఒట్టు ! ' అన్నాడు భీమవర్మ. కాని సోమశర్మ నోటివెంట మాట రాలేదు. భీతితో అతడు భీమవర్మవైపే చూస్తున్నాడు.


మరెవ్వరూ లేరు. వెంటనే విజయవర్మ తనకు పిలుపు ఎందుకు వచ్చిందో గ్రహించ గలిగాడు. 'నన్ను పిలిచారా ? ' అన్నాడు మెల్లగా. 'ఔను, కనపడ్డవారి నందరినీ నీవు యేవేవో ప్రశ్నలు వేస్తున్నావటగదా? నిన్ను పెంచి పెద్దవాణ్ని చేసినందుకు ఇదేనా ప్రతిఫలం ? నీకేంలోటు చేశాను? కన్నకొడుకు కంటే ఎక్కువగా చూసుకొంటున్నానే !' అని కస్సుమంటూ లేచాడు భీమవర్మ.

ఇవన్నీ మర్చిపోయేటంత కృతఘ్నుడిని

ఇంతలో ఆ గది కిటికీలోంచి ఒక బాణం రివ్వుమంటూ వచ్చి, ఆ ముగ్గురికెదురుగా ఉన్న గోడలో గ్రుచ్చుకొని జవజవలాడింది. అది శబ్దవేధి బాణమని ఆ ముగ్గురూ చూడగానే తెలుసుకున్నారు. సోమవర్మ ఒక పిచ్చికేకవేసి వెనక్కు పడిపోయాడు. భీమవర్మ, విజయవర్మలు పరుగెత్తుకుని కిటికీ వద్దకు వెళ్ళి తొంగిచూశారు. కానీ ఏ విధమైన అలజడీ కనిపించలేదు.




దూరంగా చెట్టుమీద పక్షులు ప్రశాంతంగా ఎగురుతున్నవి. భవన ద్వారం వద్ద యథావిధిగా కాపలా కాస్తూనే ఉన్నారు. 'సరే విజయా ! ఇక నీవు వెళ్ళు, సోమశర్మ ఒట్టువేసుకోక ఎక్కడకు పోతాడు చూస్తాను. నీవూకొంచెం కనిపెట్టిఉండు, ఎందుకైనా మంచిది ' అని భీమవర్మ విజయుణ్ణి పంపివేశాడు. అప్పుడే తేరుకొంటున్న సోమవర్మ వైపు తిరిగాడు.' నీమూలాన అతనికి మళ్ళీ అనుమానం వేసింది. ఈ రాత్రికి నీవు కూడా ఆ ఒట్టుపెట్టుకొంటే అతని ప్రాణాలు రక్షించినవాడివవుతావు. లేదా, అతడుకూడా తన తండ్రి త్రోవే పట్టవలసి వస్తుంది. ఇదిగో, వెంటనే అతణ్ణి పడమటి గదిలోకి మార్చు. ' 'పడమటిగదిలోకా ? ' అన్నాడు సోమవర్మ బొంగురుగొంతుకతో. 'ఔను అతని చావు బ్రతుకులు నీ చేతుల్లో ఉన్నాయి. ఒట్టుపెట్టుకుని యేదో విధంగా నచ్చచెప్పావా, అతను బ్రతికిపోతాడు. లేదా తండ్రితోపాటు కొడుకును చంపిన పాపంకూడా నీ తలకు చుట్టుకుంటుంది. ఏమంటావు ? ' అన్నాడు భీమవర్మ. క్షణమాత్రం ఉండి సోమశర్మ ' లేదండి, అతని ప్రాణాలు రక్షించటానికి బొంకనైనా బొంకుతాను' అన్నాడు.. 'పక్కగదిలోనే ఉంటా, అతని అనుమానం నిర్మూలం



చెయ్యి' అని భీమవర్మ వెళ్ళిపోయాడు. మరికొంతసేపటికి విజయవర్మ ఆ గదిలో ప్రవేశించాడు. పాపం సోమశర్మ ముఖం పాలిపోయివుంది. తలెత్తి చూసి విజయవర్మ చేయిపట్టుకుని 'నేనుకూడా ఒట్టుపెట్టుకొంటే నీకు సంతృప్తి కలుగుతుందిగా? భగవంతుని సాక్షిగా చెబుతున్నాను. నీ తండ్రి చావుతో నాకెట్టి ప్రమేయంలేదు' అని నిష్కర్షగా చెప్పాడు. అప్పుడు విజయవర్మ సరే మరి ప్రమేయమెవరికుందో మీకు తెలుసా? ' అని అడిగాడు. సోమశర్మ తొట్రుపడి 'లేదు, లేదు. నాకేమీ తెలియదు' అంటూ వెళ్ళిపోయాడు. నిర్ధోషినని ఒట్టుపెట్టుకొన్న సోమశర్మ ఇలా తత్తరబోయి హఠాత్తుగా వెళ్ళిపోవటం విజయవర్మకు ఆశ్చర్యం కలిగించింది. నలువైపులా కలియజూచాడు. ఎదురుగా ఉన్న గది కిటికీలు కదిలినట్టనిపించింది. ఎవరిదో ఒక కన్ను క్షణమాత్రం తళుక్కుమని తొలగిపోయింది. జరిగిన సంభాషణ అంతా ఎవరో పొంచి విన్నారన్న సంగతి విజయవర్మకు రూఢి అయింది. ఇదంతా ఒక మాయనాటకమన్న సంగతి తెలిసిపోయింది. 'నేను సాలీని వలలో చిక్కుకున్నానని ' అనుకొన్నాడు. వెంటనే కరుణాకరుడు స్ఫురణకు వచ్చాడు పాపం !


నామూలానా అతడు కూడా వలలో చిక్కుకొన్నాడే ' అని విచారించాడు. విజయవర్మ గదిలోంచి బయటకు రాగానే ఒక దూత వచ్చి అతని ఉనికి మరో కొత్తగదిలోకి మార్చబడింది అని చెప్పాడు. 'ఎందువల్ల ? ఏ గది ?' అని అడిగాడు విజయవర్మ. 'పడమటి గదిలోకి' అని బదులు చెప్పాడు దూత. 'ఎలాంటి గది? గది టబాగుంటుందా? ' అన్నాడు విజయవర్మ. 'గది కేం, భేషుగ్గానే ఉంటుంది.

ప్రేమికుడిని ప్రపంచం అంతా నెమ్మదిగా డబ్బు పట్ల ప్రేమ



దెయ్యాలున్నయన్న మాటకాని ' అన్నాడు దూత. శంకాకుల చిత్తంతో విజయవర్మ తన కొత్త నివాసం వైపు తరలాడు. ఆ గది ఎత్తు తక్కువగా, విశాలంగా, చీకటిగా ఉంది. దానిలో పందిరిమంచం మహారాజులు పడుకొని నిద్రించేదానిలాగా ఉంది. ఒకప్పుడు ఎవరో గొప్పవారున్న గది. ఇది అంతా చూడగా విజయవర్మ అనుమానం ఇంకా ఎక్కువయింది. అతడు గోడలు, ఆలమారులు అన్నీ తట్టి, పరీక్షించి చూచాడు. కాని ఎక్కడ విశేషమేమీ గోచరించలేదు. అయితే గుప్తద్వారం ఎక్కడ ? ఎక్కడో ఒకచోట ఉండి తీరాలే ? రానురాను అనుమానాలింకా ఎక్కువయ్యాయి. ఇటువంటి చోట కన్నుమూయడం ప్రమాదమనుకున్నాడు. ఇంతలో అతనికి గది తలుపులెవరో గోకుతున్నట్టు విన్పించింది. దగ్గరకు వెళ్ళి చెవి ఒగ్గి విన్నాడు. ఎవరో మెల్లగా తలుపు తీయమంటున్నారు. కంఠం గుర్తుపట్టి విజయవర్మ వెంటనే తలుపుతీశాడు. చేతిలో చురకత్తి పట్టుకొని కరుణాకరుడులోన ప్రవేశించాడు. 'ఏం జరిగింది? కోటలో ప్రవేశించాక మళ్ళీ కనిపించలేదేం? ' అని ఆత్రంగా ప్రశ్నలు వేశాడు విజయవర్మ. 'ఏం జరిగితేనేం, మనం మళ్ళీ ఇక్కడ కలుసుకున్నాం. నీవుమట్టుకు త్వరగా పారిపో. తెల్లవారితే ప్రాణాలు దక్కవు. వాళ్ళు గుసగుసలాడుకోవటం నేను చెవులారా విన్నాను' అన్నాడు కరుణాకరుడు. తరువాత వారిద్దరూ కలసి గుప్తద్వారం కోసం మళ్ళీ వెతకటం ప్రారంభించారు. ఇంతలో గదిబయట అడుగుల చప్పుడు వినిపించింది. దీపం ఆర్పేసి వారిద్దరూ చీకటిలో దాక్కొనికూచున్నారు. గది ఒకమూల వారు గోడ అనుకొన్నచోట చెక్కలు తొలగి కొంచెం

అదృష్టం గానీ, ప్రేమగానీ ధైర్యం గలవారికే దక్కుతాయి



వెలుతురు లోనికి చొరబడింది. విజయుడూ కరుణాకరుడూ ఊపిరి బిగపట్టుకుని ఇది చూస్తూనేవున్నారు. ఇంతలో భవనం వెలుపల కేకలూ, అరుపులూ వినిపించాయి. తక్షణమే గుప్త ద్వారం మూసుకుంది. 'హంతకుడు' ఇది అదను కాదని వెళ్ళిపోయాడు. బయట అరుపులిప్పుడు స్పష్టంగా వినవస్తున్నాయి. 'కరుణ ఏది? వెతకండి ! వెదకండి ! ' అంటున్నారెవరో ! ' 'కరుణ ఎవరబ్బా ! కరుణాకరా ! పొరపాటున నిన్ను ఆడపిల్లవనుకోవటం లేదుగదా వాళ్ళందరూ ! ' అన్నాడు విజయవర్మ. 'మొదటికే ముప్పు వచ్చిందిప్పుడు. నన్ను పట్టుకున్న దాకా ఊరుకోరు వాళ్ళు. తలుపు తెరచి నన్ను పోనివ్వు విజయా ! వాళ్లు నన్ను పట్టుకొని సంబరపడుతుంటే నీవు తప్పించుకుపోవచ్చు ' అని సలహా చెప్పాడు కరుణాకరుడు. అప్పుడు అర్థమయింది విజయవర్మకు పరిస్థితి అంతా. 'నీవు కరుణాకరుడివికాదు. నీవే కరుణవు ' అని అరిచాడు. కరుణ మారుమాటాడకుండా నిలుచుంది. 'కరుణా ! మించిపోయిందిలేదు. బ్రతికి బాగుంటే మనిద్దరికిక ఎడబాబు ఉండదు. చావే తప్పకపోతే ఇద్దరం ఒకేసారి చద్దాం ' అన్నాడు విజయుడు. కాని అంతలో అతని మాటలు కాదనటానికే అన్నట్టుగా బయట అడుగుల సందడి వినిపించింది. అంతేకాదు, ఎవరో బలంగా తలుపు గ్రుద్దిన ధ్వని అయింది. పైగా మరునిముషంలోనే భీమవర్మ కంఠం వినిపించింది. ' తలుపు తెరువు విజయా ! లోపల ఎవరున్నదీ మాకు తెలును. వెర్రి వేషాలు వేయకు ' అన్నాడాయన. వెంటనే విజయవర్మా, కరుణాకరుడూ గుప్తద్వారంకేసి పరుగులెత్తారు. వారు బయటపడేసరికి భీమవర్మ

భటుల తాపులకు గది తలుపులు బ్రద్దలయినై. గుప్తద్వారానికి అవల ఇరుకుగా, చీకటిగా ఉన్న ఒక త్రోవవెంబడే వెళ్ళగా వారొక రహస్య కక్ష్యాన్ని చేరుకొన్నారు. మరి ముందు త్రోవలేక, అక్కడే ఆగిపోయారు. ఆ ప్రమాదసమయంలో కరుణ విజయవర్మకు తన కథంతా చెప్పింది. తానొక జమిందారు కూతురుననీ, అనాథురాలు కావటంవల్ల చిన్నప్పటి నుంచీ చంద్ర దుర్గాధిపతి ఇంట పెరిగాననీ, ద్రోహబుద్ధి గల భీమవర్మ తనను బలిమినిపట్టి తెప్పించి పురుషవేషం ధరింపచేశాడని కూడా చెప్పింది. ఆ కథంతా వినగానే విజయవర్మకు చాలా జాలివేసింది. 'బొందిలో ప్రాణం వుండగా, ఇక నిన్ను వీడను ' అని ప్రతినచేశాడు. అంతలో మళ్ళీ అడుగుల సందడి వినిపించింది. తిరిగి చూస్తే రాంసింగు 'అహ ! ఉన్నారు ఇక్కడే. ఇంకేం, అనుకొన్నంతే జరిగింది' అన్నాడు అతను. విజయవర్మ నిశ్శబ్దంగా చురకత్తి ఎత్తాడు. 'ఆగవయ్యా ! పెద్దమనిషి ! పారిపోవడానికి త్రోవ కనబడలేదా ? నే చూపిస్తాను ! అన్నాడు రాంసింగు. విజయవర్మకు అప్పుడు అర్థమయింది రాంసింగు తమ మిత్రుడేనని ! రాంసింగు వారికి ఇంతకు ముందే భీమవర్మ




దూత పోయిన రహస్య ద్వారం చూపించాడు. గోడనున్న రాతి పలక తొలగించగా త్రోవ ఏర్పడింది. వెంటనే పారిపొమ్మని వారికి సలహా చెప్పి రాంసింగు అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. విజయవర్మా, కరుణా ఆ త్రోవనే వెళ్ళి గోడను చేరుకున్నారు. అక్కడ భీమవర్మ దూత దిగిపోయిన కిటికీ వుంది. దాని చువ్వల కింకా తాడు వేలాడు తూనేవుంది. పరవాలేదని అనుకొన్నాడు విజయవర్మ. ఇంతలో వెనుకనుంచి కేకలు వినవచ్చాయి. 'రా, కరుణా ! అలసిస్తే లాభం

లే ' దన్నాడు విజయవర్మ. కాని కరుణ కిటీకీ లోంచి ఆ అగాధంలోకి తొంగి చూచి గజగజవణకి పోయింది. భీమవర్మ భటులు రానే వచ్చారు. ఏమయితే అయిందని విజయవర్మ కరుణను వదిలేసి త్రాడు పట్టుకొని దూకేశాడు. పైనుంచి బాణాల వర్షం కురిసింది. కాని విజయువర్మ లెక్కచేయకుండా ఆగడ్త ఈది అవతలకు చేరాడు. పొదలమాటున ఇక భయం లేకపోయింది. కొంతదూరం వెళ్ళిన తరువాత త్రోవలో అతనికి, శబ్ధవేధి బాణానికి ఆహుతి అయిన భీమవర్మ దూతశవం కనిపించింది. తడిమిచూడగా ద్రోహిభీమవర్మ విపక్షంలో కలిసిపోతానని దేవదుర్గాధిపతికి రాసిన జాబు కనబడ్డది. ఎందుకైనా మంచిదని ఆ జాబు తనవద్ద అట్టేపెట్టు కున్నాడు విజయవర్మ. కొంచెం దూరం వెళ్ళగానే అతనికి శబ్ధవేధి దళం వారు కనిపించారు. ఈసారి వారి వెంట నాయకునివద్దకు వెళ్ళటానికి విజయవర్మ వెనుదీయలేదు. శబ్ధవేధి అయిన చండీదాసు అతనిని హృదయపూర్వకంగా ఆహ్వానిం చాడు. 'కరుణను వెనుక వదలి రావటం తెలివిగల పని ' అని విజయుణ్ణి ఊరడిం చాడు. ' నీ సంగతి అంతా తెలిసిపోయింది. ఇక చూసుకో ' అంటూ విజయుడు భీమవర్మకు ఒక ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరం చూసి చూడటంతోనే భీమవర్మ పళ్ళు పటపట కొరికాడు.




ప్రతిభ ఒకటేశాతం ప్రేరణయితే, 99 శాతం చెమట ఓట్చడం అవుతుంది


నసీరుద్దీన్ కథ
ఒకసారి నసీరుద్దీన్, పరమ పిసినారి, మోసగాడూ అయిన అహ్మద్ దగ్గరికి ఉద్యోగం కోసం వెళ్ళాడు!
నసీరుద్దీన్ నీకు ఉద్యోగం ఇస్తున్నా. కానీ నువ్వు చేసే ప్రతి తప్పుకు ఒక బంగారు దీనారును జరిమానాగా కట్టాలి!
పాపం నసీరుద్దీన్ జీతమే పది దీనార్లు!
జీతం రోజు రానే వచ్చింది!
నువ్వీ నెల పదిహేను తప్పులు చేశావు. నువ్వే నాకు ఐదు బంగారు దీనార్లు బాకీ పడ్డావ్!
ఔరా! ఎంత మోసం!
నా జీతం డబ్బును ఎలాగైనా సంపాదిస్తా...
కొద్ది రోజుల తర్వాత...
ఇదుగో పదివరహాల బంగారు దీనార్ల సంచి! దీన్ని జాగ్రత్తగా పక్క గ్రామం లోని మా అమ్మగారికి ఇచ్చిరా!
తొందరగా తిరిగి రావాలి! నువ్వు చేయాల్సిన పని ఇంకా చాలా ఉన్నాయి!
కానీ...
వెళ్ళి మూడు రోజులు అయింది. ఇంతవరకు మనిషి పత్తా లేదు. రానీ పని చెప్తా...
ఇన్ని రోజులు ఏం చేశావ్?
మా అమ్మగారి ఇల్లు చాలా దూరమండీ!
నేను బంగారు దీనార్లు ఇచ్చి రమ్మంది మా అమ్మకు కానీ నీ అమ్మకు కాదు... ఎంత పొరపాటు చేశావ్?
నన్ను క్షమించండి హుజూర్, నేను తప్పు చేశాను. మీ అమ్మగారికి ఇవ్వాల్సింది మా అమ్మకు ఇచ్చేశాను! ఈ రోజు తప్పుతో కలుపుకొని చేసిన ఏడు తప్పులకు కలిపి ఈ ఆరు బంగారు దీనార్లు వేసుకోండి!
మిగిలిన పది బంగారు దీనార్లతో సంతోషంగా తన ఇంటికి వెళ్ళాడు నసీరుద్దీన్!

బుజ్జాయి మినీ న్యూస్
BUJJAYI MINI NEWS

సంపుటి : 43 సంచిక : 9
April - 2018 నిర్వహణ: జి.ఎ.రావు

తిరుమల వైభవం!!



గర్భాలయానికి ముందు ధ్వజస్తంభం, బలిపీఠం ఉన్నాయి. ధ్వజస్తంభ మండప ఆవరణలోనే బలిపీఠానికి ఈశాన్యమూలన "క్షేత్రపాలకశిల" ఉన్నాది. తిరుమల పుణ్య క్షేత్రానికి క్షేత్ర పాలకుడు రుద్రుడు. అంశా స్వరూపంతో శివుడు శ్రీనివాసునికి రక్షగా ఇచ్చట వెలుగొందుతూ ఉన్నాడు.

ఆనందనిలయంలో ఉన్న మూలవిరాట్టు 'స్థానక' అంటే నిలుచున్న భంగిమలో తూర్పుముఖంగా ఎత్తయిన పద్మపీఠంపై ఉన్నారు శ్రీస్వామివారు. పద్మపీఠంనుంచి స్వామివారి కిరీటాగ్రం వరకు ఎత్తు తొమ్మిది అడుగుల తొమ్మిది అంగుళాలున్నాది.

స్వామివారివిగ్రహం ఆగమ,శిల్పశాస్త్రాలకు అతీతమైనరీతిలో దర్శ నమిస్తోంది. ఈ విగ్రహాన్ని "అరుణఘన శిలా" విగ్రహంగా, సాలగ్రామ మూర్తిగా పరిగణిస్తారు. అయితే నిత్యమూ పునుగు నూనెతో మర్దిస్తున్న కారణంగా నల్లరాతి విగ్రహంలా కన్పిస్తుంది.

స్వామివారి శిరోజాలు నిడుపైనవే కాక, తీరుగా అల్లిన జడరూపంలో కనిపిస్తాయి. అవి, వీపు మీదుగా చాలా క్రింద వరకు వ్యాపించి ఉన్నాయన్న సంగతి చాలామందికి తెలియక పోవచ్చు. స్వామివారి తలకట్టుపై అలంకరించిన రత్నకిరీటం 21 అంగుళాల ఎత్తు కలిగి ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది.

కాలి మడమలకు కడియాలుకూడా ఉన్నాయి.

శ్రీనివాసుని మూలవిగ్రహాన్ని దగ్గరగా చూస్తే నడుము కింద భాగం మోకాళ్ళు ఒకింత వంగినట్లుగా కనిపిస్తుంది.

మోకాళ్ళ మధ్య కొంత ఎడం కనిపిస్తుంది. శ్రీవారు సొంపైన భంగిమలో నిలిచి తన కటి వరద హస్తాలతో మోకాలిని చూపుతూ "సంసారసాగర సముత్తరణైకసేతో" అంటే 'నన్ను నమ్మిన వారికి సంసారసాగరము మోకాలిబంటి' అని చెప్తున్నట్లుంటుంది.

ఇటువంటి దివ్యమంగళ స్వరూపాన్ని ప్రతిరోజూ చూస్తూ సేవిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు – అర్చకం వెంకటరమణ దీక్షితులు గారిని స్వామివారి విగ్రహ వివరాలు మరిన్ని తెలిపారు.

ఆయన గురించి ఇక్కడో విషయం చెప్పుకోవాలి. దీక్షితులవారు కణజీవ శాస్త్రంలో డాక్టరేటు పట్టా పుచ్చుకున్న వారు. ఆగమశాస్త్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. శ్రీవారి ఆకార స్వరూపాలను చెప్పమని అడిగిన వెంటనే ఒక్క క్షణం కళ్ళు మూసుకుని స్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని ధ్యానం చేసుకుని పులకితాంగులై ఇలా అన్నారు –

"స్వామివారు ఆజాబాహుడైన ముప్పై సంవత్సరాల యువకుని నిండైన రూపంతో ఉన్నారు. వారి దివ్యమంగళ విగ్రహాన్ని వర్ణించేందుకు మాటలు చాలవు. ఒకపోగు ప్రక్కకు జారిన ప్రలంభ యజ్ఞోపవీతంతో కుడివైపు వక్షంపై శ్రీవత్సంతో ఉండే స్వామిని చూచేందుకు రెండు కళ్ళు చాలవు. ఆరాటం లేకుండా నిరాపేక్షతో ఈ స్వామిని శరణు వేడితే అన్నీ శుభాలే జరుగుతాయ"న్నారు. మూల

స్వామివారి నేత్రాలు ఊర్ధ్వముఖంగా కానీ, అధోముఖంగా కానీ ఉండవు. అవి 'సమదృష్టిని' ప్రసరిస్తూ ఉంటాయి.


ముక్కు కొనదేరి ఉండదు. అయినా అది చప్పి ముక్కుకాదు. అధరాలు అందంగా ఆకర్షణీయంగా ఉండి మందహాసం చేస్తూ ఆనందాన్ని కలిగిస్తాయి. స్వామివారి చుబుకము, చెవులు సమ పాళ్లుగా తీర్చిదిద్దినట్లుగా ఉంటాయి. చెక్కిళ్ళు నిగనిగలాడుతూ, చుబుకం కింద చక్కని తెల్లని చుక్కతో నుదుటిపై నామాలతో స్వామి వారు తన అనుగ్రహ వీక్షణాలతో భక్తులను కట్టి పడేస్తాడు.

స్వామివారి శ్రీవక్షము సమున్నతంగా ఉంటుంది. వక్షములమీద చుట్టు కొలత 39 అంగుళాలుకాగా, వక్షముల దిగువ చుట్టుకొలత 33 అంగుళాలు. అర్చామూర్తికి ఉన్నవి రెండు చేతులే. చతుర్భుజుడుగా మనకు కన్పించే గోవిందునకు పై ఎడమచేతిలో శంఖం, పైనుండే కుడి చేతిలో చక్రం. కింది కుడిచేయి వరముద్రతో వరదహస్తంగా ఉంది. కింది ఎడమచేయి "కట్యవలంబిత" ముద్రను పట్టి ఉండడంతో "కట్యవలంబిత హస్త"మని అంటారు.

స్వామివారి కుడివక్షః స్థలమందు శ్రీమహాలక్ష్మి నివసిస్తోంది. ఆసనభంగిమలో ఉన్న ఈ స్వరూపం మూలవిగ్రహంలో భాగమే.

ఎడమవైపున పద్మావతి స్వరూపం మనకు కన్పిస్తుంది. ఇది మూలవిగ్రహంలో భాగంకాదు.

స్వామివారి యజ్ఞోపవీతం స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. వారిమెడలో నాలుగు హారాలు వేలాడుతూ ఉంటాయి. వారి దండా భరణాలు నాగాకృతిలో ఉంటాయి. నడుము నుంచి పాదాలదాకా స్వామి ధోవతి ధరించి ఉంటారు. నడుముకు పై భాగాన వస్త్రాచ్ఛాదన లేదు. వారి కటి బంధము రెండంగుళాల మందాన స్పష్టంగా కనిపిస్తుంది. శ్రీవారి భుజాలపైన చారలున్నాయి. విల్లు, అమ్ముల పొది ధరించడం వల్ల ఇవి ఏర్పడినట్టు పరిగణిస్తారు. స్వామివారి విరాట్టును ఇంత పరి శీలనగా చూచిన తర్వాత అర్థమ యిందేమిటంటే తిరుమలేశుని విగ్రహం ఆగ మాలకు అందని రూపమని.




వక్ష స్థలంపై కౌస్తుభం, చేతికి నాగాభరణాలు, ఆలయ ప్రాకారాలపై శక్తి వాహనమైన సింహం....ఇలా విభిన్నమైన దేవతాముద్రలు కలిగిన దివ్య మనోహర విగ్రహం వీరిది. "ఇరుండిరువురుం ఒంద్రాయ్ ఇసైందు (రెండు మూర్తులూ నీయందే ఏకమై ఉన్నాయి) అంటూ పేయాళ్వార్లు నోరారా కీర్తించారు. ఇటువంటి రూపంతో నన్ను వేంకటేశుని కొందరు సాక్షాత్తు నారాయణుడనీ, మరికొందరు శివుడని, ఇంకొందరు శక్తిస్వరూపమని, సుబ్రహ్మణ్యేశ్వరుడని అభిప్రాయ పడుతున్నారు. ఎవరి ఆధారాలు వారు చూపిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ అన్నమయ్య ఇలా అన్నారు –

"కొలుతురు మిము
వైష్ణవులు కూరిమితో విష్ణుడని,
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మమనుచు
తలంతురు మిము శైవులు తగిన భక్తులను శివుడనుచు

విష్ణువా? శివుడా? అనే చర్చ ఆదికాలంనుండి ఉన్నదే.

అయితే ఏది నిజం? అన్నీ నిజాలే! అతడు నారాయణుడైన పరమేశ్వరుడు. శక్తిస్వరూపుడు. అన్నమయ్య అన్నట్లుగా "ఎంత మాత్రమున ఎవ్వరు దలచిన అంతమాత్రమే నీవు" – అదే అసలైన సమాధానం. స్వామివారికి భక్తే ప్రధానం.

(ఇంకా ఉంది)



అడవికి రాజు !

అది ఒక కారడవి. మిట్టమధ్యాహ్నపువేళ. ఎండ మహాతీక్షణంగా ఉంది. అటువంటి సమయంలో ఒక నక్క దప్పిక తీర్చుకుని, కొలను ఒడ్డునే ఒక చెట్టుకింద విశ్రమించింది.

అదే సమయానికి ఒక తోడేలు అక్కడికి వచ్చింది. నక్కను చూడగానే దానికి సంతోషం కలిగింది. నక్కకు ధైర్యం, సాహసం లేవుగాని, అది జిత్తులమారి అన్న సంగతి దానికి బాగా తెలుసు. 'ఏమోయి తమ్ముడూ! తీరికగా కూర్చున్నావ్ ? వేట మంచి జోరుగా సాగినట్టుందే ! ' అన్నది తోడేలు. 'వేటా లేదు, నా తలకాయా లేదు. ఎండ మండిపోతూ, గొంతుక ఎండిపోతూ వుంటే వేట ఎక్కడ? ఐనా ఏం వేటలెద్దూ. రోజూ కోళ్లను తినితిని జిహ్వ చచ్చింది ' అని నిస్పృహగా బదులు చెప్పింది నక్క. ఈ మాటలు వినగానే తోడేలుకు ఏదో చప్పున గుర్తుకు వచ్చినట్టయింది. ఈ మాటలు వినగానే తోడేలుకు ఏదో చప్పున గుర్తుకు వచ్చినట్టయింది. 'అదేరా తమ్ముడూ, నీలాగే నేనూ బాధపడుతూవున్నా. ఎన్నాళ్ళు లేళ్లూ, పొటేళ్లూ తప్ప మరేమీ లేక , నాకు చవి చచ్చిందంటే నమ్ము ' అన్నది మళ్ళీ తోడేలు. అంతలో ఎక్కడి నుంచి వచ్చిందో ఒక చిరుతపులి అక్కడికి వచ్చి కలిసింది. దానిని చూస్తూనే, నక్కా, తోడేలూ తోకలు జాడించి, చెవులు ఆడించి, భక్తితో తలలు వంచి నమస్కరించినై. 'ఓహో బావమరుదులు బాతాఖానీలో పడ్డారే. భారీయెత్తున ఏదో వేట సాగించినట్టుందే.!' అంటూ పలకరించింది

డి.లక్ష్మీకాంతం - ఒంగోలు




చిరుతపులి. అక్కడనే ఒక చెట్టుకు ఆనుకొని స్తిమితంగా నీడన కూర్చున్నది. నక్కా తోడేలు ముఖాముఖాలు చూచుకున్నాయి. తరువాత వినయం ఉట్టిపడేటట్టు గొంతుకపెట్టి, నక్క – 'బావగారి ధాటి ముందూ, దర్పాల ముందూ మేమేపాటి ! ఎన్నడైనా ఇంత అడవిపంది మాంసం తిని ఎరుగుదుమా, కాస్త ఎనుబోతుబొమిక కొరికి ఎరుగుదుమా ! మేమెంత, మా వేట ఎంత ! ' అన్నది. అందుకు 'ఏమిటో అనుకొంటారుగానీ, అడవిపంది మాంసమూ, ఎనుబోతూ బొమికలూ తినీతినీ నాలుక బెరడుకట్టుకపోయింది. బావగారూ ! – తింటే ఏనుగు కుంభస్థలమే తినాలి. అదీ మగసిరి అంటే. ఏమంటారు? ' అన్నది చిరుతపులి. చిరుతపులి పలుకులు వినగానే నక్కకు ఏదో ఉపాయం తట్టింది. 'బావగారూ ! నిజంగా మీరు బ్రహ్మస్వరూపులే !' మీ రాకతో మా బాధలన్నీ పటాపంచలమయినై. మిమ్మల్ని చూడగానే మంచి ఉపాయం ఒకటి తట్టింది. మహాగొప్ప ఉపాయం సుమండీ ! ' అన్నది నక్క వినయంతో. ఈ మాట వినగానే 'ఏమిటేమిటి?' అని తోడేలు చిరుతపులీ చెప్పలేని ఆత్రంతో అడిగినై నక్కను. అప్పుడు నక్క చెవులూరేటటువంటి చక్కటి ధోరణిలో 'బావగారికి అన్నగారికి కూడా నాలుక మీది రుచులు చచ్చినట్లు స్పష్టంగా తెలిపోయింది. ఇక నా సంగతి చెప్పనే అక్కరలేదు. ఈ పరిస్థితిలో మనం సరాసరి, మనకు పెద్ద అయినటువంటి సింహం వద్దకు వెళ్ళి, ఆయనతోపాటు వేటకు బయల్దేరితే బాగుంటుందని నా ఉద్దేశం' అని అన్నది. ఇందుకు 'భలే ఉపాయం ! ' అని తోడేలూ చిరుతపులీ నక్కను ఎంతో మెచ్చుకున్నాయి. నక్క చెప్పిన సలహా ప్రకారం వెంటనే ఆ

మూడూ బయల్దేరి మృగరాజు వద్దకు వెళ్ళినై. వెళ్ళి సంగతి సందర్భాలన్నీ వెల్లడించినై. అంతా విన్నాక సింహం 'సరే'నని అంగీకరించింది. ఇప్పుడు మృగరాజుతోసహా ఆ మూడూ కలిసి ఆ మిట్టమధ్యాహ్నపు మండుటెండలో ఏనుగుకోసం బయల్దేరినై. ముందుగా సింహం నడవసాగింది. తక్కినవి దాని వెంటబడినై. సూర్యుడు అస్తమించేవరకూ అవి అలా తిరుగుతూనే ఉన్నై. కాని ఎంత తిరిగినా అవి ఆశించినట్టు ఏనుగు దొరికిందేకాదు. ఏనుగే కాదు, ఏనుగుజాడైనా కనబడలేదు. చివరకు ఆ నాలుగూ ఏనుగుమాట దేవుడెరుగు. ఏదో ఒక మాంసం దొరికితే చాలురా బాబూ, ఆకలి తీరటానికి ' అనుకునే స్థితి వచ్చింది. అంతలోనే ఆ దారిన ఒక లేడి పోతూ ఉంటే దానిని పట్టి అవి చంపివేశాయి. ఆ లేడిని నక్క సమంగా నాలుగు వంతులు వేసింది. ఆకలితో నకనకలాడుతున్న తోడేలు చిరుతపులి వాటివంతులు అవి ఆరగించ బోయినై. 'ఆగండి! ' అని గర్జించింది సింహం.



'నేను మృగరాజునన్న సంగతి తెలుసు కదా ? రాజునైన నాకు రెండు భాగాలు. న్యాయశాస్త్ర ప్రకారం నా సంతతికి ఒక భాగం. పోతే ఇక ఒక భాగం మిగిలి ఉన్నది. ఆ భాగాన్ని మీలో ఎవరైనాసరే నన్ను జయించి గెల్చుకోవచ్చు ! ' అని చెప్పింది. ఇలా చెబుతూ మృగాలకు పెద్ద అయిన సింహం ఆ లేడిని తన కాళ్ళకిందకి లాక్కొని, యుద్ధానికి సిద్ధపడబోయింది. 'పెద్దవాళ్ళతో పని ఇంతేకాబోలు ' ననుకొని సింహంవైపు చూస్తూనే నక్కా, తోడేలూ, చిరుతపులీ చల్లగా జారుకొన్నాయి.


ఏ కార్యాచరణ వల్ల ఎక్కువ మందికి తృప్తిని ఇవ్వగలుగుతామో అదే ఆనందానుభూతి



శాంతిదేవత !

పూర్వకాలమందు కొంతమంది కత్తిని ఆశ్రయించి బతికేవాళ్ళు. అనగా కత్తిని చేతపట్టి యుద్ధాలలో పాల్గొని జీవనం సాగించేవారు. అలా అనేక యుద్ధాలలో పనిచేసిన మహాయోధుడు శూరసింహుడు. అతనికి ఒకానొకప్పుడు ఉద్యోగం లేకుండాపోయింది. ఏమీ? రాజులకు యుద్ధాలంటే విసుగుపుట్టింది. అందుచేత వారిలో వారు సంధులు చేసుకొన్నారు. అస్త్రశస్త్రాలన్నీ మూల పారవేశారు. రాజ్యం ప్రశాంతంగా ఉంటే యుద్ధమెందుకు? సైనికులెందుకు ? ఇప్పుడు శూరసింహుడికి గట్టి చిక్కే వచ్చింది. అతనికి చేతనైన పని ఒక్కటే కత్తి చేపట్టటం. ఎన్ని తలలైనా అవలీలగా నరికి వేయగలడు. మరిప్పుడు యుద్ధం పనిలేదాయె. వానికి మరేపనీ చేతకాదాయె. ఎలా? 'రాజులంతా పిరికి పందలైపోయారు ! ప్రజలంతా పౌరుషహీనులయ్యారు ! నా కత్తి మూలపడ వలసిందేనా ? తప్పుపట్టవలసిందేనా ? ' అని అతనికి తీరని విచారం కలిగింది. ఏమైతేనేం, తిండికీ, గుడ్డకూ మొహం వాచి, శూరసింహుడు కృశింపసాగాడు. గడ్డి గాదం లేక అతని గుర్రం బక్క చిక్కిపోయింది. చివరకు విధిలేక ఉద్యోగంకోసం బయ ల్దేరాడు శూరసింహుడు. వెళ్ళగా వెళ్ళగా, ఒకనాటి సూర్యోదయం వేళ ఒక పొలం చేరుకున్నాడు. ఆ పొలందున్ను కొంటున్న రైతును శూరసింహుడు తన గుర్రం మీదినించే కేకవేసి – 'ఓయీ, నాపేరు శూరసింహుడు. వినలేదా? నేను మహా యోధుణ్ణి. నేనిప్పుడు పని లేకుండా వున్నాను.

పి. నీలకంఠం – విజయవాడ



నాకేమైనా పని చూపించగలవా ? ' అన్నాడు. ఈ ప్రశ్న వినగానే రైతు దున్నటం మాని, శూరసింహుడికేసి చప్పున తిరిగి చూచాడు. ఒరలో కత్తి, వాలకం చూడగా రైతుకు భయమూ వేసింది, జాలీ కలిగింది. ' నాగలి దున్నటం చేతనైతే నా దగ్గర పని ఉంది.

ముందు ఆ కత్తి కఠారులూ అవతల పారవేసి రావయ్యా' అన్నాడు రైతు. అందుకు శూరసింహుడు 'అబ్బాయి !- నాగలి దున్నటం నా చేతకాదు. నీకు శత్రువులెవరైనా వుంటే చెప్పు. నిమిషంలో వాళ్ళ తలలు నరికి నీ ఎదుట పెడతా. నాకు భోజనం, నా గుర్రానికి ఇంత దాణా ఏర్పాటు చేస్తే చాలు. మరేమీ వద్దు ' అన్నాడు. రైతు మాట్లాడలేదు. క్షణకాలం శూరసింహునికేసి చూచి, మళ్ళీ ఎప్పటిలా పొలం దున్నుకోసాగాడు. 'హ్ ! – పౌరుషహీనులు !! మనిషన్న తరువాత శత్రువే ఉండడా? చేతకాకపోతే సరి, శత్రువును సంహరించటం ? పైగా, నన్ను నాగలిదున్నుకు బతకమంటున్నాడు. ఈ పిరికిపంద. నావంటి యోధుడు చేయవలసిన పనేనా ఇది ? ' అనుకొన్నాడు తనలో శూరసింహుడు. అనుకొని అలా ఒక అరణ్యంమార్గం పట్టి పోగా పచ్చటి మైదానం కంటపడింది. ఆ మైదానంలో మంచి ఎత్తున ఒక దేవతా విగ్రహం ఉన్నది. అదే యుద్ధదేవత ! – ఉత్సాహంతో గుర్రాన్ని దౌడు తీయిస్తూ పోయి, శూరసింహుడు ఆ విగ్రహం ముందు నిలబడ్డాడు. ఆ దేవి విగ్రహం ఇరవై అడుగుల ఎత్తున ఉంది. నిప్పులు చెరిగే కన్నులు, చితులలో విచ్చుకత్తులు – భయంకొల్పుతూ ఉన్నాయి. కాని దేవిచేతిలో కత్తి చూడగానే శూరసింహుడు సంతోషంతో ఉప్పొంగి పోయాడు. 'ఆహా ! ఏమి విగ్రహం !! అంతా అచ్చుబంగారం !!!' అని ఒక్క కేకవేశాడు ఉత్సాహం పట్టలేక. 'కాదోయ్. విగ్రహమంతా వెండి ! ఇది రజత విగ్రహమేకాని స్వర్ణవిగ్రహం ఎంత మాత్రం

కాదు". అంటూ బదులుగా అతనికి ఒక కేక వినిపించింది. కేక వినిపించేటంతలోనే ఆ విగ్రహానికి వెనుకనుంచి డాలూ, కత్తీ ధరించిన ఒక గుర్రపు రౌతు ముందుకు వచ్చాడు. పౌరుషంతో శూరసింహుడు పళ్ళు పటపట కొరికాడు.


ఒరలోనించి కత్తి దూశాడు. 'అరేయ్ ! - నా మాటనే ధిక్కరిస్తున్నావా ? నేనెవరో తెలుసా ? శూరసింహుడు ' అని గర్జించాడు. రెండవ యోధుడు వెటకారంగా నవ్వి, కత్తి ఒరలో నుంచి బయటకు లాగుతూ - హ్హా ! నువ్వు కళ్ళులేని కబోదిలాగా ఉన్నావే ! వెండికీ, బంగారానికీ తేడా తెలియని నీతో యుద్ధానికి తలపడటమంటే నిజంగా నాకు అవమానకరంగా తోస్తున్నది. నేనెవరో తెలిసే మసులుకొంటున్నావా? నేను ధీరసింహుణ్ణి. రా, నా కత్తిబలం చవిచూపిస్తా " అన్నాడు. గుర్రాన్ని ముందుకు ఉరకలు వేయిస్తూ. మరుక్షణంలోనే యోధులిద్దరూ తలపడ్డారు. కత్తుల వెరిపిడితో, గుర్రాల సకిలింపులతో వారిపౌరుషవాక్కులతో ఆ ప్రదేశం తెరిపి లేకుండా మారుమోగి పోతున్నది. అంతలో హఠాత్తుగా 'ఆగండి ! కత్తులు ఒరలో పెట్టండి !!' అంటూ ఒక కేక వినిపించింది. యోధు లిద్దరూ ఆ కేక వచ్చిన దిక్కుకి ఆశ్చర్యంగా చూచారు అలా చూచేసరికి - మల్లిపువ్వుల




వంటి తెల్లటి దుస్తులు ధరించినది. శాంతం ఉట్టిపడుతున్న మోము కలది. ఒక అందమైన యువతి నవ్వుతూ వారి వద్దకు వచ్చి ' మీ ఇద్దరూ మహాయోధులే ! అసహాయశూరులే !!" అన్నది. 'వాని సంగతి ఏమోకానీ, నా పేరు శూరసింహుడు' అన్నాడు మొదటి వాడు. వాని సంగతి తెలియదుకాని, నా పేరు ధీరసింహుడు' అన్నాడు రెండవ వాడు. ఇద్దరికేసి చూచి ఆ యువతి 'మీ కత్తుల పదునులో కాస్తంతయినా మీరు బుద్ధిమంతు లైతే ఈ కొట్లాట జరిగేది కాదు' అన్నది. 'మూర్ఖుడికి దూరదృష్టిలేదు. ఈ యుద్ధ దేవత విగ్రహం వెండిదట !' అని పరిహసించాడు

శూరసింహుడు. 'అతనికి దృష్టి వక్రించింది. వెండి విగ్రహాన్ని బంగారు విగ్రహమని వాదించడమేమిటి, అవివేకం కాకపోతే !' అని గేలి చేశాడు ధీరసింహుడు.

అప్పుడా యువతి పకపకా నవ్వి, యోధులిద్దరనూ వెంటబెట్టుకుని విగ్రహం చుట్టూ తిప్పింది. వెండిదని మొండిగా వాదించిన ధీరసింహుడికి, విగ్రహానికి ఒకవైపు బంగారపుపూత కన్పించింది. విగ్రహం బంగారపుది అని వాదించిన శూరసింహుడికి వెండిపూత కన్పించింది. ఇద్దరూ తెల్లబోయి, ఒకరివంక ఒకరు చూచుకోసాగారు. అంతలోనే ఆ యువతి అంతర్థానమయ్యింది. ఆమెకోసం వారిద్దరూ ఆత్రంతో అటూ ఇటూ చూడగా, ఒక దిక్కు నుంచి ఇలా వినబడింది. 'యోధుల్లారా ! - నేనే శాంతిదేవతను. మీ ఇద్దరూ మహాయోధులే. మీ ఇద్దరి ఉద్దేశాలు సరి అయినవే. కయ్యాలు మానండి. పౌరుషపడకండి. శాంతంగా జీవించండి !!' శూరసింహుడు, ధీరసింహుడు గుర్రాల మీదినుంచి దిగారు. ఒకరినొకరు కౌగలించుకున్నారు. డాలు, కత్తులూ విగ్రహం ముందు పారవేశారు. నాటినుండీ వారిద్దరూ వ్యవసాయవృత్తి అవలంబించి ప్రశాంతంగా జీవనం గడుపసాగారు.




చరిత్ర చదవడం కాదు... చరిత్ర సృష్టించాలి



సుందర నాయనర్ !

తొమ్మిదవ శతాబ్ది ఆరంభంలో సుందర నాయనార్ అనే మహాభక్తుడు మన దేశంలో జన్మించాడు. ఆయన గొప్ప భక్తుడు మాత్రమే కాదు. అద్భుత చరితుడు. తమిళనాడులోని తిరునావలూర్ గ్రామము నందు ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు నాయనార్. ఆ బిడ్డడు సౌందర్యమూర్తి కావటంచేతనే సుందరర్ అనే పేరు అతనికి సార్థకమైంది. బిడ్డడి అందచందాలూ, వాని చురుకుదనమూ ఆ ఊరి పెద్ద అయినటువంటి మునరాయర్'ను ఎంతగానో ఆకర్షించినై. ఆయన సుందరర్‌ను తీసుకుపోయి, తన భవనంలో అపురూపంగా, అల్లారుముద్దుగా పెంచుకొంటూ వున్నాడు. యుక్తవయస్సు రాగానే ఉపనయనాది కర్మలు జరిపించాడు. పేరొందిన గురువులను పిలిపించి బిడ్డడిని సమస్త విద్యలలోనూ ప్రవీణుని చేశాడు. క్రమంగా సుందరర్‌కు పెళ్ళి ఈడు వచ్చింది. సంబంధం నిశ్చయమైంది. పెళ్ళి పీటలమీద సుందరర్‌ను కూర్చోపెడతారనగా ఒక వృద్ధుడు అక్కడికి వచ్చి, 'ఇదేమిటయ్యా, వీడు మా కుటుంబానికి సేవకుడు. మా అనుమతి లేకుండా మీరు వీడికి పెళ్ళి ఎలా చేస్తారు? కావాలంటే ఈ పత్రం చూసుకోండి. నా మాట నిజమో, అబద్ధమో తెలుస్తుంది' అన్నాడు. అక్కడ ఉన్నవాళ్ళంతా ఆశ్చర్యపోయి చూస్తూ వుండగా, కోపంకొద్ది సుందరర్ ఆ పత్రం లాక్కొని చూడకుండానే చించిపారవేశాడు. అప్పుడు వృద్ధుడు ఎంతమాత్రం చలించకుండా 'మాది తిరువెన్నైనల్లూరు గ్రామం. ఇప్పుడి కుర్రవాడు చించివేసిన పత్రం నకలు మాత్రమే. అసలు తాటాకుపత్రం మా ఇంట్లోనే ఉన్నది

- అంబడిపూడి శర్వాణి శరత్ సుబ్రహ్మణ్యం, గుంటూరు



నుమండీ ! ' అన్నాడు. ఇందుకు అక్కడివారందరూ ఏకమాటగా 'ఏమిటయ్యా పిచ్చివాడా ! బ్రాహ్మణుడేమిటి, మీ కుటుంబానికి బానిసగా ఉండడమేమిటి ? ఎక్కడైనా వుందా ఇటువంటి విడ్డూరం ! వెళ్ళు వెళ్ళు. నీ దారిని నీవు పోవయ్యా " అంటూ కేకలు వేయసాగారు. వాళ్ళ కేకలతో ముసిలివాడు మరింత రెచ్చిపోయాడు. ఈ వివాహం జరగటానికి ఏమీ వీలులేదన్నాడు. అప్పుడు సుందరర్ అయితే ఆ పత్రమేమిటో చూపించు' మని వెంటపడ్డాడు. వృద్ధుడు ఒక తాళపత్రం తెచ్చి గ్రామస్తులముందు పెట్టాడు. అది సుందరర్ తాతగారు వ్రాసిన పత్రం. 'మేమూ, రాబోయే తరాలవారమూకూడా తిరునావలూరు సైతాన్‌కు సేవకులుగా ఉండ గలవారము. అని అందులో స్పష్టంగా రాసివున్నది. ఈ పత్రం అందరకూ వింత గొలిపింది. గ్రామంలో పంచాయతీ చేశారు. సుందరర్ తాత ఇంతకుముందు వ్రాసి ఉన్న పత్రాలు కొన్ని తెచ్చి, సంతకం పోల్చి చూచారు. ఇవన్నీ పరీక్ష చేసిన మీదట, 'ఈ పత్రం పిల్లవాని తాతగారు వ్రాసినదనటానికేమీ సందేహంలేదు' అని ఆ ఊరి పంచాయతీదారులు తీర్పు చెప్పారు. అయితే మీ ఇల్లెక్కడో చూపించవయ్యా !' అని ముసిలివానిని గద్దించగా ఆ వృద్ధుడు నవ్వుతూ 'రండయ్యా, రండి !!' అంటూ వారిని తీసుకువెళ్ళి గర్భగుడిలోపల దూరిపోయి అంతర్హితుడయ్యాడు. ఆ క్షణమందు సుందరర్‌కు నిద్ర నుండి లేచినట్టనిపించింది. ఆ క్షణమందే జ్ఞానోదయమై, పూర్వ జన్మ స్మృతికలిగింది. కిందటి జన్మలో ఒకప్పుడు ఈ సుందరర్ అనే కుర్రవాడు కైలాసపర్వతానికి పోయి, పార్వతీదేవి పక్కనే ఉండే అందాల పరిచారికలను ఇద్దరను చూడగానే

మానవజాతి చరిత్రను నిర్ధారించేది ఆకాశంలో ఏం జరుగుతుందో దానిబట్టి

ఇటువంటి అప్సరసలను పెళ్ళాడని జన్మఎందుకు ! ' అని మనసులో అనుకొన్నాడట. ఇందుకు పరమేశ్వరుడు కోపించి 'నీవు భూలోకమందు మాకు సేవకునిగా జన్మించవలసింది ' అని శపించాడట. సుందరర్ పరమేశ్వరుని కాళ్లమీదపడ్డాడు.



పరమేశ్వరుడు తన భక్తునిమీద జాలివేసి, తరుణోపాయం అనుగ్రహించాడు. ఈ శాపంవల్లనే సుందరర్‌కు భూలోకమందు మానవజన్మ కలిగింది. పోతే జ్ఞానోదయం కలిగిన క్షణం నించీ సుందరర్‌కు రోజురోజూ ఈశ్వరభక్తి ఎక్కువ కాజొచ్చింది. అతను వరుసగా దేశంలోని శైవక్షేత్రాలన్నీ దర్శింపనారంభించాడు. వెళ్ళిన చోటల్లా మృదుమధురమైన కవిత్వంతో తన్మయత కలిగేటట్టు ఈశ్వరుని స్తుతించేవాడు. సుందరర్ దర్శించిన శైవక్షేత్రాలలో అతనికి భగవంతుడు చిత్రమైన అనేక మహిమలు చూపిస్తూ వచ్చాడు. సుందరర్ చిదంబరం, తిరువారూర్ వెళ్ళాడు. తిరువారూరులో ఉండగా 'పరవైనాచ్చియార్' అనే పిల్లతో అతనికి వివాహమైంది. ఈ నాచియారే క్రిందటి జన్మలో తను వరించిన పార్వతీదేవి పరిచారికలలో ఒకతె అనే సంగతి పూర్వజ్ఞానం వల్లసుందరర్ గ్రహించాడు. సుందరర్ 'తిరువత్తియూర్' గ్రామం చేరుకొన్నాక భగవంతుని ఆజ్ఞను శిరసా వహించి 'సంగిలి నాచ్చియార్ ' అనే మరిఒక కన్యను వివాహం చేసుకొన్నాడు. ఈ సంగిలినాచ్చియార్ అతిలోకసుందరి. ఆనాడు పార్వతిపక్కని తను చూచిన రెండవ పరిచారికగా ఉండిన అప్సరసే ఈ సుందరి అని సుందరనయనార్‌కు అవగాహనయింది. ఒక బిల్వవృక్షం కింద ఈమెను సుందరర్ వివాహం చేసుకున్నాడు. 'ఎన్నడూ నిన్ను



విడనాడను' అని అతనివద్ద ప్రమాణం తీసుకోమని పరమేశ్వరుడు ఆమెను పురికొలిపాడు. అలానే ఆమె పెళ్ళికి ముందు మాట తీసుకున్నది. అయితే తొందరపడి మాట ఇచ్చాడేగాని తరువాత సుందరర్ ఆలోచనలో పడ్డాడు. అయ్యో ఇక్కడినుంచి కదలనని ప్రమాణం చేశానే. మరి తక్కిన క్షేత్రాలు దర్శించడం ఎలాగా !' అని జిజ్ఞాస కలగగానే 'స్వామీ ! నేను తొందరపడి ఈమెకు మాట ఇవ్వటంవల్ల ఇక కదలటానికి వీలు లేకపోతున్నది. కనుక నీవే ఈ వృక్షంలో శాశ్వతంగా ఉండిపోవలిసింది ' అని ఈశ్వరుని ప్రార్థించాడు. సంగిలినాచ్చియార్ వద్ద కొంతకాలం ఉండేసరికి, సుందరర్‌కు మళ్ళీ తక్కిన క్షేత్రాలు దర్శించుకొందామనే కుతూహలం కలిగింది. మాట తప్పిన సంగతి తెలిసే, తిరువత్తియూర్ దాటి మరొక క్షేత్రానికి పోబోయాడు. ఐతే సుందరర్ ఊరిపొలిమేర దాటేసరికల్లా అతనికి రెండు కన్నులూ కనబడకుండా పోయినై. గుడ్డితనంలోనే సుందరర్ భక్తి విడువకుండా ఆవేశపూరితమైన శ్లోకాలు చెప్పి స్వామిని ప్రార్థించుకొంటూ క్షేత్రాలు సేవింపసాగాడు. కానీ దృష్టి తప్పినా పర్యటన మానలేదు. ఆ పట్టుదలతోనే కర్రచేత పుచ్చుకుని తడుముకొని అడుగులు వేసుకొంటూ కంచి వెళ్ళేసరికి ఎడమకన్ను కనిపించనా రంభించింది. తిరువారూరు చేరుకునేసరికి పూర్తి దృష్టి వచ్చేసింది. ఈలోపల మొదటిభార్య అయిన పరవైనాచ్చియార్ ఇతను రెండవపెళ్ళి చేసుకొన్న సంగతి తెలిసి, సుందరర్‌ను ఇంట్లో అడుగు పెట్టవద్దన్నది. అప్పుడు సుందరర్ తన ఇష్టదైవాన్ని వేడుకోగా పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఇద్దరికి మళ్ళీ స్నేహం కలిపాడట.

ఈ సంగతి తెలిసి 'కలిక్కామనాయనార్

చిత్తశుద్ధితో దానం చేసేవాడు. ఆ దబ్బుకు పన్ను కట్టాలో లేదో ఎప్పుడూ ఆలోచించడు


అనే ఒక భక్తుడు ఉగ్రుడై సుందరర్ వద్దకు వెళ్ళి ఏమిరా నీ పొగరు ! పరమేశ్వరుడిని వశపరచుకొని, నీ సంసార విషయాలలో దూతగా ఉపయోగించుకొంటావా? ' అంటూ తిట్టనారంభించాడు. తన భక్తులు పేచీ పడటం పరమేశ్వరునికి ఇష్టంలేక ఒక యుక్తి చేశాడు. స్వామి మహిమవల్ల కలిక్కామ నాయనారుకు శూలనొప్పి కలిగింది. అది కుదర్చటం ఎవరి వల్లనూ కాలేదు. చివరకు పరమాత్ముడు అతనికి కలలో కనిపించి 'ఓయీ నాయనార్ ! – నీ బాధ కుదర్చటానికి సుందరర్ ఒక్కడే సమర్థుడు' అని చెప్పాడు. కాని కలిక్కామనాయనారుకు సుందరర్‌ను ఆశ్రయించడమనేది అంతకంటే ఎక్కువ బాధగా తోచింది. ఏమైనాకానీ ఈ బాధల నుండి విముక్తి పొందాలని, విరక్తి గలిగి కత్తితో తన పేగులు కోసివేసుకొని ప్రాణాలు విడిచాడు.


ఈ వార్త చెవినపడగానే సుందరర్ చాలా దు:ఖించి ప్రాణత్యాగం చేయటానికే సిద్ధపడ్డారు. ఆ క్షణమందే పరమేశ్వరుడు ప్రత్యక్షమై, కలిక్కామనాయనారును బతికించి 'భక్తులారా ! మీరిద్దరూ నాకు సమానులే. ఇటుపైన స్నేహంగా ఉండండి ' అని హితవు చెప్పి అదృశ్యుడయ్యాడు. తరువాత సుందరర్ అనేకమైన ఇతర క్షేత్రాలు దర్శించు కొంటూపోయి, పరమేశ్వరుని ప్రార్థించగా ఐరావతం భూలోకానికి దిగివచ్చింది. సుందరర్ దానిపైన ఎక్కగానే, అది విమానంలాగా ఎగిరిపోయి, సుందర్‌ను కైలాసంచేర్చి ఈశ్వరుని సాన్నిధ్యమందు ఉంచింది. !!. మహాప్రవక్త అయిన సుందరర్ పవిత్ర చరిత్ర వింటే ఒక్క తమిళదేశస్థులకే కాదు, ఎవ్వరికైనా తన్మయత కలిగి తీరుతుందనటానికి సందేహంలేదు.




కాగితపు పాత్రతో నీళ్ళు కాచటం !

మామూలుగా మనం వ్రాసుకునే కాగితంతో ఒక దొప్పవంటిది తయారు చేసి అందులో లోహపాత్రలో కాచుకొన్నట్టుగానే నీళ్ళుపోసి కాగబెట్టవచ్చు. ఇది వినటానికి ఆశ్చర్యం కొలిపేదిగా ఉంది. కాని, దీనిని చేయటం మట్టుకు ఎంతో సులువు. కాగితంతోటి ఏమిటి, పాత్ర తయారు చేయడమేమిటి ?- అనే సమస్య మొదటనే మీకు విడ్డూరం అనిపిస్తుంది. చేయవలసిన విధానం ఇది. మామూలు కాగితం తీసుకుని, దానిని క్రింది బొమ్మలో చూపిన ప్రకారం,చదరంగాగాని, కోలగాగాని నలుప్రక్కలా, అడుగునా ఆకారం వచ్చేటట్టుగా మడుచు. మడతలు ఊడిపోకుండా రెండువైపులా రెండు గుండుసూదులు గుచ్చు. బొమ్మలో చూడు. చక్కటి పెట్టె ఆకారంగా తయారైన ఈ కాగితపు దొప్పను చేతపుచ్చుకో. మెలిపెట్టి ఈ దొప్పను వేలాడదీయ్యి లేదా చేతనైతే నీ చెయ్యి కాలకుండా ఉండేటట్టు చూసుకుని పట్టుకొని ఉన్నాసరే. ఇంచుమించు నిండుగానే, నెమ్మదిగా తొణకకుండా దొప్పలో చన్నీళ్ళు పొయ్యి. నీటితో నింపిన ఈ దొప్పను మంటపైన పెట్టు. మంట తగలగానే కాగితం అంటుకొని మాడిపోతుందేమో అని నీవు భయపడతావు. కాని అలాటి భయం అవసరమేలేదు. కాగితం ఎంతమాత్రం కాలదు. సరికదా దొప్పలోని నీరు క్రమంగా వేడెక్కి కొద్దిసేపటికల్లా చూస్తూ వుండగానే సలసలా కాగిపోతుంది. ఇది నీవు చేయటం చూచి నీ స్నేహితులు ఆశ్చర్యంలో మునిగిపోతారు.






- తలశిల మహిమ



శిలాముఖుడు !

చిరకాలం క్రిందట ఒక ఊరిలో శిలాముఖుడు అనే షావుకారు ఉండేవాడు. అతడికి నగదుతోపాటు, సమస్తమైన ఫలవృక్షాలు కలిగిన పెద్దతోట ఉండేది. ఆ పెద్ద తోటలో ఒక మూలని చిన్న పూరిపాక వేసుకుని అందులో అతను కాపురం ఉంటూ ఉండేవాడు. శిలముఖుడు గడ్డుపిసినారి. తోటలో పండే ఫలాలు తను తినేవాడు కాదు. ఒక్క ఫలమైనా ఇతరులకు ధర్మమూ చేసేవాడు కాదు. చెట్లకాయలు కోయటానికని కూలివాళ్ళను నియమించాడు. శిలాముఖుడు. ఒకసారి ఏమి జరిగిందంటే :విరగకాని నేలకు వేలాడుతున్న మామిడికాయలను కూలీలు కోసి బుట్టలలో నింపుతున్నారు. కూలీలు కోసిపడవేస్తున్న ప్రతి కాయనూ శిలాముఖుడు జాగ్రత్తగా లెక్కిస్తూ 'పావలా, అర్ధరూపాయి, ముప్పావలా .... " అంటూ వెలలు కట్టి గుణిస్తున్నాడు. అంతలో ఒక కూలీవాడు దోరగా ఉన్న మామిడికాయ తీసి కొరకబోయాడు. వాడిని చూస్తూనే శిలాముఖుడు 'అబ్బీ !- ఆ కాయ ఖరీదు రూపాయి. నీ కూలీ అర్థరూపాయి. రేపు వచ్చి పనిచేస్తే బాకీ తీరిపోతుంది !' అన్నాడు. కూలీవాడు నివ్వెరపోయాడు. ఉదయం నుంచీ కాయలు కోస్తున్న తను ఏదో నోరూరి ఒక్కకాయ నోటపెట్టేసరికల్లా 'ఖరీదు రూపాయి' అంటున్నాడే అని కోపం వచ్చింది. శిలాముఖుడు, కూలీవాడు మాటామాటా పెంచుకొన్నారు. నానాతిట్లు తిట్టుకున్నారు. అలా వాదం ముదిరి చేతులు కలిసినై. కూలీవాడు రెచ్చిపోయి శిలాముఖుణ్ణి దేహశుద్ధి చేశాడు. దాంతో శిలాముఖుడు ఉగ్రుడూ, అప్పటినుంచీ తోటలో కాయలు

పాలంకి వెంకట రామచంద్రమూర్తి



కోయకుండా అలాగే ఉంచేశాడు. అయితే అప్పుడప్పుడు ఆ పండ్లను చూస్తే నోరు ఊరేది. కాని అంతలోనే ఎంత లేదన్నా, ఒక్క మామిడిపండు నాలుగణాలు చేస్తుందే ! అంత ఖరీదుగల పండు తినివేస్తే ఇంతరాబడి నాకు నష్టమేకదా !' అని అనుకునేవాడు. కాలం గడుస్తూ ఉంది. రకరకాల పండ్లు అన్నీ పండి రాలిపోతుండేవి. శిలాముఖుడు మాత్రం అలా చూస్తూ ఊరుకునేవాడు. ఎవరైనా 'ఏమిటయ్యా అలా తోట పాడు పెడుతున్నావే ?' అని అడిగితే 'నేనేం తెలివితక్కువ దద్దమ్మననుకున్నావా? ఈ కూలీవాళ్ళను చచ్చినా నమ్మగూడదు. కాయలు కోయండర్రా అంటే తినేస్తుంటారు. పోనీ తిన్నవాటికి డబ్బు కట్టమంటే మీది మీదికి వస్తారు. ఎందుకొచ్చిన బాధ !' అనేవాడు.

ఒకనాడు శిలాముఖుడు తోట చుట్టివద్దామని బయలుదేరాడు. తోటమొత్తం ఎన్నిచెట్లు ఉన్నాయి? ఏ చెట్టుకు ఎన్ని కాయలు కాసినై? రాలిన వెన్ని? కొమ్మల నుంచి వేలాడుతున్న వెన్ని? ఈ విధంగా అతడు లెక్కలు వేయసాగాడు. అలా తోటలో నడుస్తూ పోతున్న శిలాముఖుడికి ఒక మామిడికొమ్మమీద కూర్చుని శ్రావ్యంగా పాడుతున్న ఒక చిన్న అందాల పక్షి కన బడింది. అది పిచ్చుకంతే ఉంది. దానితోకకు ఇంద్రధనుస్సులో కనబడే రంగులన్నీ ఉన్నవి. ఆ చిన్నారి పక్షి మధురంగా గానం చేస్తూంటే మోళ్ళు సైతం చిగురించేటట్లు ఉంది. ఆ మధురగానం విని శిలాముఖుడు తన్మయుడై పోయాడు. వెనకాలే పోయి చిన్నారి పక్షిని గుప్పెట్లో చిక్కించుకున్నాడు. అయితే అది గిలగిలా కొట్టుకోనూలేదు, కోపంతో అతనిని పొడవనూలేదు. శిలాముఖా నన్ను

ప్రేమ పాలించే రాజ్యం / దేశంలో చట్టాలు వుండవు

విడిపించావంటే నీకు లాభించే మూడు దివ్యసూక్తులు వినిపిస్తాను అని అంది. పక్షి నోటి నుంచి ఈ విధంగా మానవభాషలో మాటలు వినబడేసరికి శిలాముఖుడు తత్తరపాటు చెందాడు. నిజంగా లాభించే సూక్తులే చెబుతావా? అని ప్రశ్నించాడు. లాభించటం అంటే ధనరూపంలోనే కదా ! అనుకున్నాడతను. ఔను నిజంగా లాభించే సూక్తులే చెబుతాను అన్నది పక్షి. మారు మాట్లాడకుండా శిలాముఖుడు పక్షిని గుప్పెట్లో నుంచి వదిలాడు. అది ఎగిరిపోయింది. లాభం అన్న మాట ఎప్పుడైతే చెవిన పడిందో ఆ క్షణమందే అతనికి గల కాస్త ఇంగితమూ ఇగిరిపోయింది. ఆ పక్షి రివ్వున ఎగిరిపోయి సమీపాన మామిడికొమ్మమీద వాలింది. శిలాముఖుడు నోరు తెరుచుకుని ఏమి చెబుతుందా అని చెవురిక్కించి ఉన్నాడు. ఇదిగో నేను చెబుతానన్న సూక్తుల్లో మొదటిది లేనిదాని కోసం విచారించకు అని అన్నది పక్షి. ఈ మాట నాకు తెలియదా ! ఇలాంటి నీతులన్నీ చిన్నతనంలోనే చదువుకున్నా ! నీ పిచ్చితో బుర్ర వినేటందుకు నేను మూర్ఖుణ్ణికాను అన్నాడు శిలాముఖుడు కోపంగా. శిలాముఖా! నిజంగా నీవు మూర్ఖుడివే. కాకపోతే ఇంతసేపు నన్ను



గుప్పెట్లో ఉంచుకునికూడా నా శరీరంలో మణుగు బంగారం ఉన్న నంగతి గ్రహించనేలేకపోయావే ? అన్నది పక్షి. మణుగు బంగారమే. ఒక్క మణుగు. అయ్యో నిన్ను వదిలిపెట్టి ఎంత పొరపాటు చేశాను అని విచారించాడు శిలాముఖుడు. ఇందుకు పక్షి పకాపకా నవ్వి రెక్కలు టపటపా ఆడించింది. శిలాముఖా నువ్వు మూర్ఖుడివే. పరమ మూర్ఖుడివే. చిన్న పిచ్చుకంత ఉన్న నాలో మణుగు బరువుగల బంగారం ఉందంటే ఎలా నమ్మగలిగావు పిచ్చివాడా అన్నది పక్షి. శిలాముఖుడు పళ్ళు కొరికి గుడ్లు

చట్టం అప్పుడప్పుడు నిద్రిస్తుంది. కాని చావదు.

ఇంతింత చేశాడు. అప్పుడు పక్షి అతనితో మళ్ళీ ఇలా అన్నది. ఇక రెండవ సూక్తి విను. ఇతరులు చెప్పిందంతా నిజమే అనుకోకు. ఇదీ నేను చిన్నతనంలో చదువుకున్నదే. ఇందులో మాత్రం కొత్తేముంది అన్నాడు శిలాముఖుడు గుడ్లురుముతూ. అన్నీ తెలుసనుకునే తెలివితక్కువ దద్దమ్మవు నీవు. ఇక మూడో సూక్తి విను. గుప్పుట్లో చిక్కిన లక్ష్మిని వదులుకొని చెట్ల కొమ్మల మీద వెతకకేం అన్నది పక్షి. ఈ మాటకు శిలాముఖుడు తలకు నేలకు కొట్టుకుని అవును నేను నిజంగా మూర్ఖుడినే అని ఒప్పుకున్నాడు. ఆ సమయంలో తోట మధ్యన ఒక పెద్దగాలి లేచింది. ఎండిన ఆకులను, అలములను గిర్రుమని సుడులు తిప్పుతూ ప్రతీ చెట్టును సమీపించింది. ఆ సుడిగాలి వేళ్ళతో కూడా బ్రహ్మాండమైన వృక్షాలను సైతం నేలకూల్చింది. భయంతో కళ్ళు మూసుకున్నాడు శిలాముఖుడు. కళ్ళు తెరచి చూస్తే ఏముంది? తోటలోని చెట్లన్నీ కూకటి వేళ్ళతో సహా పెళ్ళగింపబడి ఉన్నాయి. చెట్టు కొమ్మమీద చిన్నారి పక్షి అంతర్థానమైంది. అతను నివసించే పూరిపాక కప్పుకూడా ఎగిరిపోయి మొండిగోడ మాత్రం ఆనవాలు ఉన్నాయి. లక్ష్మీదేవి సకల ఐశ్వర్యాలు ఇచ్చింది. అయితేనేం నేను అనుభవించలేదు. ఇతరలను అనుభవించ నీయలేదు. చివరకు అంతా నేలపాలైంది. నిజంగా నేను మూర్ఖుడినే అనుకుంటూ పరిపరివిధాల విలపించాడు శిలాముఖుడు.




ప్రతిరోజు రాత్రి నిద్రించే ముందు, మీ చింతలన్నీ కట్టగట్టి, పడగ్గది ద్వారం బైట పారేయండి

పంచ పాండవులు !

పాండవులు ఐదుగురుని ఎలా అయినా హతమార్చాలనే దుర్యోదనుడు కాంక్షపట్టి ఉన్నాడు. తన పరివారంతో నిరంతరం సలహాలు చేస్తూనే ఉన్నాడు. అనేకమైన వ్యూహాలు పన్ని అవన్నీ విఫలములై తరువాత చివరకు ఒకేఒక అమోఘమైన ఉపాయం పన్నాడు. అదేమిటంటే కనకుడనే గొప్ప శిల్పిని రప్పించి అందమైన ఒక లక్క ఇంటిని సృష్టించాడు. మీ అన్నదమ్ములందరూ ఈ ఇంట్లో ఉండండి అని ధృతరాష్ట్రుని చేత పాండవులకు హితవు చెప్పించాడు. ఆ ప్రకారం వచ్చి పాండవులు లక్క ఇంటిలో మసలుతూ ఉండగా చూచి ఒక రోజున ఆ ఇంటికి నిప్పు అంటించమని పురోచనుడనే అంతరంగికునితో ఏర్పాటు చేసి ఉంచాడు. అయితే పాండవ పక్షపాతి అయిన విదురిని వలన భీమసేనుడు ముందుగానే ఈ ఏర్పాటు తెలుసుకున్నాడు. పురోచనుడు లక్క గృహాన్ని దహనం చేయబోయే సమయంకూడా తెలుసుకున్నాడు. ఈ పరిస్థితులన్నీ గ్రహించి అంతకుముందుగానే తవ్వి ఉంచిన ఒక రహస్య సొరంగం ద్వారా భీముడు గాఢ నిద్రలో ఉన్న తన తల్లి కుంతీదేవిని సోదరులనందరనూ ఎత్తుకు తీసుకుపోయి గంగానది ఒడ్డుకు చేర్చాడు. విదురుని ఏర్పాటు ప్రకారం అక్కడ ఆ సమయాన సిద్ధంగా ఉన్న ఒక పడవ పాండవులను, కుంతీదేవిని ఎక్కించుకుపోయి సురక్షితమైన ఒక ప్రదేశమందు దిగబెట్టింది. తరువాత భీమసేనుడు మరలి వచ్చి పురోచనుడి కంటే ముందు తనే లక్క ఇంటికి నిప్పంటించివేశాడు. చిటికసేపటిలో లక్క గృహం పురోచకుడితో సహా భస్మీపటలమై ఊరుకొన్నది. తెల్లవారగానే అక్కడ బూడిద మాత్రమే కనబడింది. పాండవులందరూ చచ్చి ఉంటారని దుర్యోదనులు సంతోషించారు. ఈ ఘోరవార్తవిని భీష్మాదులు దు:ఖించారు. అందరితోపాటు విదురుడునూ దు:ఖం నటించాడు. పురోహితులను రప్పించి చచ్చారనుకున్న పాండవులకు కౌరవులు ఉత్తరక్రియలు జరిపించారు. ధృతరాష్ట్రుడు కూడా పాండవులకు తిలోదకాలు వదిలాడు. దగ్ధమైన లక్క ఇంటిని గురించి తన ప్రజ్ఞ తలచుకుని దుర్యోధనుడు పొంగిపోయాడు.


పి. నారాయణమ్మ – రాజమండ్రి



కళ్ళ ముట్టడి !

పూర్వకాలమందు రాజపుత్రస్థానంలో అనేకమైన చిన్నచిన్న సంస్థానాలు ఉండేవి. అటువంటి వాటిలోదే మీవార్ సంస్థానం. మీవార్‌కు ముఖ్యపట్టణం చిత్తూరు. మీవార్‌ను పాలించే రాజులు రాణాలు. అటువంటి వారిలో ఒకడు రత్నరాణా. రత్నరాణాకు తన పదవితో తృప్తి కలగలేదు. ఇరుగుపొరుగు రాజులనందరినీ వశం చేసుకోవాలని వాళ్ళ వద్ద కప్పం వసూలు చేసి చక్రవర్తిననిపించుకోవాలని బుద్ధి పుట్టింది. పుట్టగానే మీరంతా వచ్చి నాకు పాదాక్రాంతులై కానుకలు చెల్లించివెళ్ళండి' అంటూ వారందరకూ రాయబారాలు పంపాడు. చిత్తూరుకు 60 మైళ్ళలో బూందీకోట అనే ఒక కోట ఉంది. బూందీ సంస్థాన ప్రభువు సురాజమల్లుడు. చాలా పరాక్రమశాలి. చిత్తూరు నుంచి వచ్చిన రాయబారి తన మాటలు చెప్పగానే తోకతొక్కిన రాజులాగే లేచాడు సురాజమల్లు. రాయబారి హడలిపోయాడు. వెనుకకు తిరిగి చూడకుండా తిరిగి దారిపట్టిపోయి జరిగినదంతా పూసగుచ్చినట్లు రాణాకు మనవి చేశాడు. రాణా మండిపడ్డాడు. బూందీ కోటపైకి దాడికి వెళ్లడానికి సైన్యాలను సిద్ధం చేయవలసిందని ఆజ్ఞాపించాడు. బూందీప్రభువు చాలా బలవంతుడు. అతని సైన్యంలోని ప్రతీరాజపుత్రుడు గొప్ప పౌరుషవంతుడు. అటువంటి వానితో కయ్యం పెట్టుకోవటం పనికిరాదు. అని అనేక విధాల రాణాకు చెప్పి చూచారు సంస్థానంలో మంత్రులు, సేనాధిపతులు కూడా. కానీ ఎవరిమాటా రాణాకు చెవికెక్కలేదు. అందరి సలహాలను త్రోసిపుచ్చి సైన్యాన్ని వెంటపెట్టుకుపోయి బూందీకోటను రాణా వెంటనే ముట్టడించాడు. రత్నరాణా కొలువులో

ఆర్. వీరభద్రం, కాకినాడ




లాలాజీ అనే పేరుగల రాజపుత్రుడున్నాడు. అతను బూందీకోటలో పుట్టినవాడే. బూందీ ప్రభువైన సురాజమల్లునితో అతనికి చుట్టరికం కూడా ఉన్నది. అయితే ఏదో ఒక సందర్భంలో మాటపట్టింపు రావటంవల్ల లాలాజీ కొంతమంది సైనికులను తన వెంటపెట్టుకుని బూందీపట్టణం వదలిపోయి రాణా కొలువులో కుదురుకున్నాడు.

రాణా బూందీకోటను ముట్టడించడానికి వెళ్ళినపుడు లాలాజీ చిత్తూరులో లేదు. ఏమంటే సైనికులతో సహా ఫలానా గ్రామానికి పోయి పన్ను వసూలు చేసుకుని రావాల్సింది అని రాణాయే అతనిని ఎక్కడికో పంపాడు. తనకు ఇట్టే వశమైపోతుంది కదా బూందీ కోట అని అనుకున్నాడు రాణా. కానీ బూందీ ప్రభువైన సురాజమల్లుడు బలవంతుడు. పైగా చతురుడు. ఫలానా రాణా తనపైకి దండెత్తి వస్తున్నాడనే వార్త తెలిసి తెలిసీ తెలియటంతోనే చకచకామంటూ గొప్ప ఏర్పాట్లు కొన్ని చేశాడు. ఒక సంవత్సరం పాటు రాజకుటుంబానికి, పరివారానికి సరిపడా భోజన సామగ్రితో కోట నింపేసి తలుపులు మూయించివేశాడు. రత్నరాణా సేనలతో సహా కోట బయట విడిసి ఇదంతా చూడగా ఏమీ చేయలేక ఆలోచనలో పడ్డాడు. ఎత్తైన కోటగోడలు, లోతైన కందకాలు దాటి పోదామాఅంటే ఎంతమాత్రమూ వశం కాలేదు. ఇలా వుండగా కోటపై నుండి బాణాలు, బండరాళ్ళు, వేడివేడి చమురు దారలువచ్చి పడటంతో కిందనున్న సైనికులు నాశనం కాజొచ్చారు. ఈ స్థితిలో రాణా బూందీ కోట వశం కావాలి' అప్పుడు నేను భోజనం చేయాలి' అంటూ ప్రతిజ్ఞకూడా బూనాడు. ప్రతిజ్ఞ పూనినంతమాత్రాన కోట వశం అవుతుందా! పరిస్థితిలో మార్పు ఏమీ కనబడలేదు. కోట అతనికి వశం కాలేదు. రాణా భోజనం చేయలేదు. మంత్రులు, ముఖ్యోద్యోగులు కలిపి ఎన్నివిధాలో రాణాను భోజనం చేయమని కోరారు.

ఎంతబతిమాలినా అతను పట్టువిడువలేదు. రాణా అలాగనే భీష్మించుకుని కూర్చున్నాడు. రోజులు గడిచేకొద్దీ రాణాకు శరీరంలో నీరసం ఎక్కువగుతూ వచ్చింది. చివరకు రాజ్యంలో ప్రతీవారికి మా రాణాకు ఎలా నచ్చుజెప్పటం ఆయనను ఎలా బ్రతికించు కోవటం అనే ఆత్రుత పట్టుకుంది. ఈ స్థితిలో ముఖ్యమంత్రికి ఒకానొక ఆలోచన తట్టింది. ప్రభూ తాము మాటతప్పని మానధనులని లోకానికి తెలుసు. ఈ సందర్భంలోనైనా మీరు ఇప్పుడు మాట తప్పిపోనక్కర్లేదు. అందుకు ఒక పని చేద్దాం. ఏమిటంటే మనం తక్షణమే మన చిత్తూరు నగరానికి మరలిపోవటం. ఇటువంటిదే అక్కడ ఒక కోట కట్టించి దానికి బూందీకోట అని పేరుపెట్టడం. దానిని ముట్టడించి వశం చేసుకోవడం. ఇలా చేస్తే దేవరప్రతిజ్ఞ భంగం కాకుండా ఉంటుందని నా ఉద్దేశం అన్నాడు. ఈ ఉపాయం రాణా మనస్సుకు చాలా నచ్చింది. మారు ఆలోచన లేకుండా సైన్యాలలో తిరుగుదారి పట్టమని ఆజ్ఞాపించాడు. అందరూ చిత్తూరు నగరం చేరుకున్నారు. ముఖ్యమంత్రి సలహా ప్రకారం ఒక చిన్న కోట కట్టారు. దాని సింహద్వారంపైన బూందీకోట అని అక్షరాలు




చెక్కించారు. రాత్రికి ఆగి తెల్లవారగానే మంత్రి కోట ముట్టడించండి.. వశం చేసుకోండి అని హెచ్చరించాడు. ఆ రాత్రికే లాలాజీ వెళ్ళిన పని పూర్తి చేసుకుని తన పరివారంతోనూ, సైన్యంతోనూ చిత్తూరుకు తిరిగి వచ్చాడు. వచ్చేసరికల్లా అక్కడ కనబడుతూ ఉన్న చిన్నకోటను చూచి ఇదేమిటి? అని అడిగాడు. సంగతీ, సందర్భాలను విని ఏడ్చినట్టే ఉంది రాణా పాలన అనేశాడు. తెల్లవారగానే రాణా సేనాధిపతి నాలుగు ఏనుగులను, పాతిక గుర్రాలను, కొద్దిగా సైన్యాన్ని తీసుకుని నకలు



బూందీకోటకు వెళ్లాడు. కోటను ముట్టడించినట్టు నటించి అట్టహాసంగా కందకాలు దాటండి.. కోటగోడలు ఎక్కండి అంటూ పెద్ద కేకలతో కోలాహలం చేయసాగాడు. మితిమీరిన ఉత్సాహంతో సేనలు రాజాధి రాజుకు జై... రత్నరాణాకు జై' అని జేజేలు కొట్టి కోటగోడలు ఎక్కడానికి ప్రారంభించారు. కానీ తలవని తలంపుగా పైనుంచి బాణాలు వచ్చి తగిలి ఎక్కడివారక్కడే కందకంలో పడిపోతూ వచ్చారు. ఏమిటిది ? లోపలున్నది ఎవరు? కళ్ళుముట్టడి అని తలచి మనం దాడి సాగిస్తూ ఉంటే నిజంగా ఇంతమంది జనాన్ని చంపేశారే? ఎవళ్ళో ఒకవమాటగా అంటూ ఈ విధంగా ఆశ్చర్యపోయాడు రాణా సేనాధిపతి. తెరవండి తలుపులు.. లోపల ప్రవేశించండి అని ఆజ్ఞాపించాడు. ఆజ్ఞాపించాడేకానీ పాషాణాల వంటి ఆకోట తలుపులు తెరవటమంటే మాటలా? ఎవరివల్ల అవుతుంది. చచ్చీచెడీ ఎలాగో సాధ్యం చేసుకుని రాణా సైనికులు కోట తలుపులు తెరిచారు. తలుపులు తెరిచినా లోపల చొరబడటానికి ఎంతమాత్రమూ వీలుకాలేదు. ఏమంటే ఒక వందమంది సైనికులకుతో లాలాజీ ద్వారం వద్ద అడ్డగించి వారిని అటకాయిస్తూ ఉన్నాడు. లాలాజీని చూడటంతోనే రాణా సైన్యాధిపతి మండిపడి ఏమోయి వీరుడా కోరి మరణం తెచ్చుకుంటావా? అని హెచ్చరించాడు ఉరుముతూ. చావంటే భయపడే రాణావారి సేనాధిపతులకే ఆ భయం. మాకు కాదు అన్నాడు లాలాజీ ధీమాగా. బూందీకోట వశం చేసుకోలేక చేతకాని దద్దమ్మల్లాగ తిరిగి వచ్చి ఇక్కడ సిద్ధమయ్యారా? పిరికి పందలూ. రోషం, పంతం ఉంటే పోయి ఆకోటను వశం చేసుకోవాలి. ఇదేంపని అనేసరికి అంతా నిశ్చేష్టులయ్యారు. ఇంతకూ

నేనెవరినో తెలుసా. బూందీ వంశస్తుడిని. కలలోనైనా బూందీకోటకు ఇటువంటి అవమానం జరిగిందంటే నేను ఒప్పుకోను. అందుకే ఈ కోట ప్రవేశించాను. దీనిని కాపాడేందుకు నిశ్చయించుకున్నాను. రండి ఎవరు వస్తారో? బూందీ వంశస్తులంటే ఎలాంటివారో ప్రతాపం చూపిస్తా ' అని అంటూ తొడ చరచి మీసం దువ్వాడు. లాలాజీ సేనలకు మీవార్ సేవలకు మధ్య గొప్ప యుద్ధం జరిగింది. లాలాజీ సైన్యం కొద్దిమందే అయినా అతిపౌరుషంతో పోరాడి మీవార్ సైనికులను ఎంతో మందిని అవలీలగా వీరస్వర్గానికి సాగనంపారు. కోట వశమైంది అనే వార్త తెలియగానే ముద్దనోటపెట్టుకుందామని విస్తరి ముందు కూర్చున్న రత్నరాణా ఇప్పటి వార్త తెలియగానే తన అవివేకానికి తననే నిందించుకున్నాడు. కళ్ళ ముట్టడిలోనైనా బూందీకోటకు అవమానం కలగటమనేది సహించని లాలాజీ అభిమానాన్ని రాణా ఎంతగానో మెచ్చుకున్నాడు. పైగా బూందీ వంశస్తులతో మరెన్నడూ కయ్యానికి కాలుదువ్వకూడదు' అని ఆనాడే నిశ్చయం చేసుకున్నాడు.



మనస్సు చేతిలో శరీరం చురకత్తిలా పని చేసే విధంగా వుండాలి

త్ర్యంబకేశ్వర లింగోద్భవం!

ఓసారి బ్రహ్మగిరి ప్రాంతం కరవు కాటకాలతో అలమటిస్తున్నపుడు అక్కడ తపోదీక్షలో ఉన్న అహల్యా గౌతములు నీటికోసం వరుణుడిని ప్రార్థిస్తారు. వరుణుడి అనుగ్రహించి ఓ గుంట ఏర్పాటు చేస్తాడు. ఆ తర్వాత ఆ ప్రాంతాల్లోని వారంతా ఆ గుంటలోని నీటినే వాడసాగారు. ఒకనాడు గౌతముడి శిష్యులు నీటికోసం ఆ గుంటదగ్గరకొచ్చి నీళ్లు పట్టుకోబోతారు. అప్పుడు అక్కడికి చేరిన ఇతర మునుల భార్యలు ఆడవాళ్లే మొదట నీళ్లు పట్టుకోవాలని గొడవకు దిగారు. వాటి నోటి ధాటికి తట్టుకోలేక గౌతముడి శిష్యులు ఆశ్రమానికి చేరి జరిగినదంతా అహల్యకు చెప్పారు. ఆవిడవచ్చి మునిపత్నులను మందలించి కావాల్సిన జలాన్ని తానే తీసుకువెళ్లింది.

అహల్య తమను మందలించడం అవమానంగా మునిపత్నులు తలపోశారు. అహల్య గురించి లేనిపోనివన్నీ కల్పించి తమ భర్తలకు చెప్పారు. భార్యల మాటలను విన్న ఆ మునులు గౌతముడికి కీడు తలపెట్టి అందుకు గణపతిని ఆరాధించారు. గణపతి ప్రత్యక్షమై వారి కోరిక తీరుస్తానని అభయమిచ్చాడు. గౌతముడి చేనులో ధాన్యాలు చక్కగా పండాయి. ఆవు రూపంలో గణేశుడు వచ్చి ఆ ధాన్యాలన్నీ మేయసాగాడు. అదే సమయంలో అటుగా వచ్చిన గౌతముడు పంట రక్షించుకోవడానికి తాను ఆవును తరమడం తప్పదు కనక నాలుగు గడ్డిపరకలను దానిపై విసిరాడు. ఆ మాయాగోవు అక్కడికక్కడే మరణించింది.

గౌతముడు గోహత్య చేశాడని ఆ పరిసరాల్లో వ్యాపించింది. అదనుకోసం చూస్తున్న అసమ్మతి మునులంతా కలసి గో హంతకుడిని చూడడమే మహాపాపం కాబట్టి వెంటనే గౌతముడిని ఆశ్రమం ఖాళీ చేసి వెళ్లమన్నారు. వారి మాటప్రకారమే గౌతముడు ఆశ్రమాన్ని ఖాళీ చేసి రెండు మైళ్ల దూరం వెళ్లిపోయాడు. అయినా ఆయనకు మనశ్శాంతి లేక మళ్లీ ఆశ్రమప్రాంతం వద్దకు వెళ్లి ఏదైనా ప్రాయశ్చిత్తం చెప్పమని మునులను ప్రాధేయపడ్డాడు. గౌతముడిని మరింత కష్టపెట్టాలనుకున్న మునులు ఆయన బ్రహ్మగిరి 11 ప్రదక్షిణలు చేసి తర్వాత ఎలాగైనా గంగానదిని అక్కడకు రప్పించాలని కోరారు. గౌతముడు అందులో స్నానం చేసి కోటి పార్థివలింగాలను అర్చించాలని తర్వాత మళ్లీ గంగాస్నానం చేసి వందకుంభాలతో గంగా జలాన్ని తెచ్చి రుద్రాభిషేకం చేయాలని అలాగైతేనే ప్రాయశ్చిత్తం అవుతుందన్నారు.

– గండూరి రేణుక

గౌతముడు మంచి ముహూర్తం చూసుకుని ఆ మునులు చెప్పినట్టుగానే ముందుగా బ్రహ్మగిరికి 11 ప్రదక్షిణలు చేశాడు. తర్వాత వరుణుడు ప్రసాదించిన దివ్యకుండంలోనే స్నానం చేశాడు. కోటి పార్థివలింగాలను ఆరాధించాడు. కోటి లింగార్చనలు పూర్తయిన తర్వాత ఆయనకు శివుడు ప్రత్యక్షమయ్యాడు. అహల్య గౌతములు పార్వతీపరమేశ్వరులకు ప్రణతులు అర్పించారు. గంగను అనుగ్రహించమని వేడుకున్నారు. శివుడు అనుగ్రహించాడు. అఖండగంగ స్త్రీ రూపంలో ప్రత్యక్షమయింది. ఆమె గౌతమీగోదావరిగా పేరుపొంది ఆగామి వైవస్వత మన్వంతరంలోని 28వ కలియుగం వరకు భూమిమీద ఉండాలని ఈశ్వరుడు శాసించాడు. ఆమె శివుడితో ఆయన కూడా ఆమె తీరంలోనే సౌందర్య రూపుడివై మెరిసి ఉండాలని కోరింది. అలాగే అన్నాడు శివుడు. ఈ విషయం దేవతలకు తెలిసి అక్కడకు చేరుకున్నారు. శివుడిని పార్వతిని గంగను ఏకకాలంలో ఆరాధించి ధన్యులయ్యారు. వాళ్లు కూడా గంగమ్మ తల్లిని అక్కడే నివసించమన్నారు.

తను అక్కడే ఉండాలంటే ఏదైనా ప్రత్యేకత తనకు కల్పించాలని కోరింది. దేవతలు అంగీకరించారు. గురువు సింహరాశిలో ఉన్నపుడు గోదావరికి పుష్కర మహోత్సవాలు జరుగుతాయని సెలవిచ్చారు. వెంటనే గంగ అక్కడ మేడి చెట్టుకొమ్మ అడుగునుంచి జలరూపంలో వెలువడి గౌతముడిని పునీతుడిని చేసింది. అది గంగాద్వారంగా ప్రసిద్ధి చెందింది. గౌతముడి పట్ల అపచారం చేసిన మునులు కూడా గంగ గురించి విని స్నానానికి వచ్చారు. కానీ వారు తన చెంతకు రాగానే గంగ అదృశ్యమైపోయింది. ఉపకారికి అపకారం చేసినవాళ్లు తనను తాకరాదన్నది. వారంతా గౌతముడిని ఆశ్రయించి బ్రహ్మగిరి 101 ప్రదక్షిణలు చేస్తే మరో ప్రాంతంలో వాళ్లను అనుగ్రహిస్తానన్నది. మునులంతా లెంపలువేసుకొని గౌతముడిని క్షమాపణ కోరారు.

తర్వాత ఆ మునులు బ్రహ్మగిరి చుట్టూ 101 సార్లు ప్రదక్షిణలు చేశారు. తర్వాత ఆ గిరి దిగువ ప్రదేశంలో గౌతముడు దర్భకొనను తిప్పగా అందులోనుంచి గంగ జలరూపంలో వెలువడింది. ఆ తీర్థంలో ముందుగా గౌతముడు అహల్య స్నానాలు చేశారు.

తర్వాత మునులుకూడా స్నానాలాచరించి పాపవిముక్తులయ్యారు. గౌతముడు దర్భకొనతో చేసిన కుండమే కుశార్తం అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. ఆ విధంగా శివుడు

అందమైన త్రయంబకేశ్వరలింగంగా వెలసిన ఆ చోటునుంచి గౌతమీనామంతో గంగానదిగా వర్ధిల్లి గోదావరిగా ప్రసిద్ధి చెందింది.

గోదావరిని పలుసార్లు జపిస్తే అందం ఆరోగ్యం ఐశ్వర్యం జ్ఞానం మంచితనం ఆయుష్షు ఒకటేమిటి అన్నీ కలుగుతాయి.

గోదావరి ఆవిర్భావం శ్రీత్రయంబకేశ్వర లింగావతరణాల తర్వాత గౌతముడు తనకు ద్రోహం చేసిన వారంతా వంశపారంపర్యంగా పరమదరిద్రులు శివేతర జ్ఞానులౌతారని మట్టిబొట్లు ధరించి నరకానికి వెళతారని ఒక కల్పాంతర కథకూడా ఉంది. అలా శపించబడిన వారంతా కంచి క్షేత్రంచేరి అక్కడే స్థిరపడ్డారు.


వారి సంతానం కూడా శివనిష్టారహితంగానే కొనసాగింది. మునులారా! ఈ గౌతమీ గోదావరి ప్రాచుర్యం శ్రీత్రయంబకేశ్వర లింగోద్భవం పుష్కర ప్రధానాల గురించి విన్నా చదివినా తెలుసుకున్నా గౌతమీస్నానఫలం సిద్ధిస్తుందని సూతమహర్షి చెప్పాడు.

దూరపు కొండలు !

దగ్గరగాఉండే కొండలకు, దూరాన ఉండే కొండలకు మనకు కనపడటంలో ఎంతో తేడాఉంది. దగ్గరగా ఉండే కొండలు రాళ్లూ రప్పలతో, చెట్టూ చేమలతో నిండి నిజమైన రంగులో మనకు కనబడతాయి. దూరాన ఉండే కొండలు అలాకాదు. నీలిరంగుగా కనిపిస్తాయి ఎందుచేత? ఇదే చిత్రం.

అలా మనకు నీలిరంగుగా కనబడేది నిజంగా కొండకు గలరంగు కానేకాదు. అది గాలికి గల రంగు. గాలిలో సూర్యుని కిరణాలు ప్రసరిస్తూ ఉంటాయి. సూర్యకిరణాలు అనేక రంగులు కలిగి ఉంటాయని అందరికీ తెలుసు.

సూర్యకిరణాలు ప్రసరించటంవల్ల గాలి నీలిరంగుగా కనిపించటంలో ఆశ్చర్యంలేదు. రంగుపొరలు కలిగిన ఏవస్తువైనా కళ్లఎదుట పెట్టుకుని కొండలను చూస్తూ కొండలు ఆ రంగులోనే కనిపించటం సహజం. అలానే గాలిలో ఉండే లేత నీలిరంగు కిరణాలవల్ల దూరపుకొండలు మనకు అదే రంగులో కనబడతాయి.



నమ్మకగల బానిస

అనగనగా ఒక నవాబువద్దను
ఉండేవాడొక నీగ్రో బానిస.
నీడలాగ అతడు తన ప్రభువుకు
ప్రక్కన ఉండేవాడు అహర్నిశలు.

ఒకరోజున అడిగారు నవాబును
ఎవరో 'అతడంటే మీకెందుకు
అంత ఇష్ట'మని చెప్పాడప్పుడు
చిన్న కథ ఒక్కటి నవాబు వారికి :

'నేనొక రోజున నా బలగంతో
బాటన పోతున్నా ఒకచోటున
పడినది నేలను ముక్తాపేటిక,
నిలచారందరు తత్తరపాటున.
ముత్యాలన్ని చెదరి రాలినవి
ధూళిని దూరంగా : నేనన్నా-
'ఎవ్వరేరుకున్నవి వారివి ఇక
వడి ఏరుకోవచ్చు ఎవరన్నా
ఈ పలుకులు విన్నంతట ఎక్కడి
వారక్కడనే పరుగెత్తారు.
ఒక్కరు మిగలలేదు నా పక్కన
ఆశలేని వారెవరుంటారు?



కొడవటిగంటి కుటుంబరావు- చెన్నై



ఇట్టి సేవకులు కలిగిన ప్రభువుకు
రాదెన్నడునూ ఎట్టి ప్రమాదం.

సేవకులది ఏముంది, ధనంతో
కొనవచ్చును మరి ఎందరినైనా.
నిష్కల్మష హృదయాల భక్తిమటు
కెవరూ కొనలేరావంతైనా "

అని నవాబు చెప్పిన కథ వినగా
కలిగిందాశ్చర్యం అందరికి.
అతడు నల్లగా మురికై ఉన్నా
మక్కువగానే ఉందందరికీ.

ఈ బానిస మాత్రం శిలలాగా
కదలలేదు నా సన్నిధి నుంచి.
నేనన్నా - ఏం కావాలో యీ
నీకింకా, ముత్యాలను మించి.'

అతడన్నాడు - నాకు ఓ దేవా !
మీ నమ్మికకన్నా వేరొద్దు.
ప్రభువిచ్చిన కానుకల మోజులో
ప్రభువును మరచిపోవటం కద్దు.

అతడిచ్చిన జవాబు విని మనసున
నాకు కలిగినది ఎంతో మోదం.



శ్రీరాముడి బోధ !!

ప్రేమ, ప్రేమంటూ కొట్టుకుపోయే మన యువతరానికి శ్రీరాముడు ప్రేమంటే ఏమిటో, ఎవరిని ప్రేమించాలో తెలియజేశాడు.

ప్రియాతు సీతారామస్య - దారాః పితృ కృతా ఇతి
గుణా ద్రూపగుణాచ్చాపి - ప్రీతిః భూయోభి వర్ధిత

ఇది పెద్దలు కుదిర్చిన పెండ్లి కదా! అని రాముడు సీతను ప్రత్యేకించి ఇష్టపడ్డాడట. తాను ధనుర్భంగం అనే పందెంలో గెలిచి వివాహం చేసుకున్నదే అయినా - ఆ ప్రయత్నం, విశ్వామిత్రుని ఆదేశంతో జరిగిందేకదా! అనంతరం ఈ పెళ్ళిని దశరథాదులందరూ అంగీకరించారు కూడా. సీత కూడా తన గుణగణాలతో, లక్ష్మీకళ విలసిల్లే రూపంతోనూ, రామునికి తనపైన ప్రేమ పెరిగేలా చూసుకుంది. ఇదీ సంసారం నిలబెట్టుకొనే లక్షణం.

ప్రేమించి పెళ్ళి చేసుకోవాలా? పెళ్లి చేసుకొని ప్రేమించాలా, అని పెద్ద పెద్ద చర్చలు జరుపుతున్న ఈ కాలంలో, యువతరానికి రాముడు ఆచరించి చూపిన మార్గం ఇది.

రామాయణంలో మానవ సంబంధాలు, కుటుంబ ధర్మాలు అడుగడుగునా దర్శనమిస్తాయి. రావణ వధాంతరం విభీషణుడు వచ్చి తన అన్నగారి పార్థివ దేహాన్ని అప్పగిస్తే రాక్షసుల వంశాచార ప్రకారం అంత్యక్రియలు నిర్వ ర్తించుకుంటామని చెప్పి శ్రీరాముని అనుమతి కోరాడు. అప్పుడు మర్యాదా పురుషోత్తముడైన రాముని సమాధానం ఇలా ఉంది....

"మరణాంతాని వైరాణి, నివృంత్తం నః, ప్రయోజనం క్రియతా మధ్య సంస్కారః మమాప్యేష యథాతవ"

ఓ విభీషణా! ఎంతటి శత్రుత్వమైనా చావుతో ముగిసిపోవాలి. సీత రక్షణకోసం, సంధి కుదరక, తప్పని సరియై యుద్ధం చేయవలసి వచ్చిందే తప్ప ఈ జననష్టం తనకిష్టం లేదని, నీ సోదరుడి అంత్యక్రియలు ఆచారం ప్రకారం జరిపించాలని" అన్నాడు.

తన భార్య సీతను బలవంతంగా ఎత్తుకుపోయిన రావణుడిపై ఎంత దయ...కనుకే రాముడు దేవుడయ్యాడు. రాముడు వృద్ధులపట్ల చూపిన ప్రేమాదరణలు ఆచరణీయాలు. వృద్ధుడయిన తన తండ్రి మాట నిలబెట్టడానికి రాజ్యాన్ని వదలుకుని అడవులకు పయనమయ్యాడు.

కానీ ఈరోజుల్లో ధనార్జనకోసం పిల్లలు కాసుల వేటలో పడి కన్నతల్లిదండ్రులను పట్టించుకోవడం లేదు. లోకంలో రాముని వంటి కొడుకు, భరత, శత్రుఘ్న, సౌమిత్రులవంటి సోదరులు, సీతమ్మ వంటి భార్య, ఏకపత్నీవ్రతుడైన రాముడు వంటి భర్త గల కుటుంబం - ఆదర్శకుటుంబమే అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

గండూరి ఇంద్రాణి

పంచ-శౌ-శీల్యాలు !

ప్రాచీన కాలం నుండి తల్లి, తండ్రి, గురువులు సమాజంలో మహోన్నత స్థానంలో ఉన్నారు. మనల్ని కని, పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి, సంఘంలో ఒక గౌరవ స్థానం కల్పించి, మనకోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లితండ్రులకు ఎంతో ఋణపడి ఉన్నాం.

బిడ్డలను మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, దేశభక్తి, దైవభక్తి అనే పంచ సౌశీల్యాలను బోధించి వారిని జాతి గర్వించతగ్గ రత్నాలుగా తీర్చిదిద్దాలి. బిడ్డలను పెంచడంలో తండ్రిది గురుతరమైన బాధ్యతే. అయితే అంతకంటే మహత్తరమైన బాధ్యత తల్లిది. తల్లిని మించిన నేర్పరి, శిక్షకురాలు ఇంకెవరుంటారు. పిల్లలకి అమ్మే మొట్టమొదటి గురువు. అమ్మ ఒడే తొలి బడి.

పితృవాక్య పరిపాలనలో అతి పిన్నవయస్సునందే తన యౌవనాన్ని తండ్రికి సమర్పించిన పురూరవుడు, తండ్రి ఆజ్ఞ మేరకు తన కన్న తల్లి, శిరసును ఖండించిన పరశురాముడు, తండ్రి కోరిక తీర్చుటకు ఆజన్మబ్రహ్మచర్యం చేపట్టిన భీష్ముడు ఎలా లోకోత్తములయ్యారో తెలిసిందే కదా!

ఎటువంటి భయంకర పరిస్థితి ఏర్పడినా బిడ్డలు తమ తల్లితండ్రుల వద్ద మాత్రం నిర్భయంగా ఉండగలుగుతారు.

శ్లో. భూప్రదక్షిణ షట్కేన కాశీయాత్రాయుతేనచ

సేతు స్నాన శతైర్యచ్చ తత్ఫలం మాతృవందనే

భూప్రదిక్షణ ఆరుసార్లు, సముద్రస్నానాలు వందల సార్లూ, కాశీయాత్ర పదివేల సార్లూ చేస్తే వచ్చే పుణ్యం - తల్లికి ఒక్కసారి వందనం చేయడంతోనే లభిస్తుందని నీతిశాస్త్రం మాట.

ఈనాటి సమాజంలో తల్లితండ్రులను ఆప్యాయతతో ఆదరించే బిడ్డలు అరుదయిపోతున్నారు. జన్మనిచ్చిన తల్లితండ్రులను ప్రత్యక్షదైవాలుగా చూడక పోయినా, వారిని హింసించి, అవమానించకుండా ఉంటే, వారికి ప్రదక్షిణలు, వందనాలు చేసినంత పుణ్యం.

పిల్లలు తల్లిదండ్రులను దుర్భాషలాడడం, అవమానించడంలాంటివి చేయకూడదు.

ఆ విధంగా మాతాపితరులను అగౌరవపరచిన వారికి ఎన్నటికీ మేలు జరగదని ఆర్య ధర్మసూక్తి చెప్తోంది.

అందరి వద్దా భగవంతుడు ఉండలేకే 'అమ్మ'ను మనకందించాడని అంటుంటారు అనుభవజ్ఞులు.

వారికి ఆనందం కలిగించే పనులు చేస్తూ, వారిని వృద్ధాప్యంలో దయతో సేవలందించడం శ్రేయస్కరం. అంతేకాదు అది పిల్లల కనీస ధర్మంకూడా.

\- చివుకుల స్వాతి

మనిషి ఆశాజీవి. ఆశ లేకపోతే మనిషి ఏ పనీ చేయడు. చేయలేడు కూడా. కనుక ఆశ అనేది ఉండాలి. కానీ ఆశ అత్యాశగా, దురాశగా మారకూడదు.

ఆశ అనేది కింది భాగం లేని పాత్రలాటిది. సప్తసముద్రాల జలాలను తెచ్చి అందులో పోసినా అది నిండదు. అలాగే అత్యాశాపరుడుకూడా. అతనికి ఎంత ఇచ్చినా తృప్తిపడడు. అనేది

భాగవతంలోని అష్టమ స్కంధంలోని ఓ పద్యం చూడండి....

వ్యాప్తింబొందక వగవక ప్రాప్తంబగు
లేశమైన బదివేలనుచుందృప్తిం
జెందని మనుజుడు, సప్త ద్వీపముల
నయిన జక్కంబడునే....

లభించిన దానితో తృప్తిపడనివాడు సప్తద్వీపాలలో ఎక్కడికి వెళ్ళినప్పటికీ లేదూ ఆ సప్తద్వీపాలకూ అతనిని అధిపతిని చేసినప్పటికీ సుఖపడడు.

జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులవారు ఇలా అన్నారు...

'కోవాదరిద్రోహివిశాల తృష్ణః శ్రీమాంశ్చ కోయస్య సమస్తతోషః'.

దరిద్రుడెవడు? ధనవంతుడెవడు? అని ప్రశ్న వేసి అత్యాశ కలవాడే దరిద్రుడు. సంతుష్టిని పొందిన వాడే ధనవంతుడు అని ఆయన సమాధానం చెప్పారు.

ఒకసారి ఒకరాజుగారి వద్దకు ఓ యాచకుడు వచ్చాడు. తనకు కొంత భూమిని దానం ఇవ్వవలసిందిగా యాచించాడు. మరుసటిరోజు ఉదయం రాజు అతడిని ఒక మైదానం వద్దకు తీసుకు వెళ్ళాడు.

'ఇదిగో, ఈ భూమి అంతా నాదే! నువ్వు పరుగెత్తడం మొదలు పెట్టి సూర్యాస్తమయం అయ్యేసరికి ఇక్కడికి రా! ఈ లోపల నువ్వు ఎంత మేర పరుగెత్తుతావో, ఆ మేరకు ఆ నేలంతా నీదే!' అని చెప్పాడు రాజు.

వాడు పరుగెత్తడం మొదలుపెట్టాడు. వేగాన్ని పెంచాడు. గంటలు గడిచాయి. మైళ్ళు వెనుకబడిపోయాయి. దాహం వేస్తున్నాది. పట్టించుకోలేదు. ఆకలి వేస్తున్నాది. అయినా పట్టించుకోలేదు.

అతనికి ఎంతసేపటికీ ముందుచూపే! వెనక్కు తిరగలేదు.

ఆశ! ఆశ!! ఆశ!!!

అట్లాగే పరుగెడుతున్నాడు. కొంతసేపటికి ఆయాసం వచ్చింది. గుండె పట్టేసింది. కిందపడి మరణించాడు.

ఈ కథ కొసమెరుపు ఏమిటంటే, వాడి శవాన్ని పూడ్చిపెట్టడానికి ఆరడుగుల నేల సరిపోయింది. అత్యాశనేది అలాంటిది.

ఈ ఆశాపాశం చాలా పొడవైనది. దీనికి అంతం లేదు. మనిషికి కోరికనేది సహజమే. ఆశ అనేది కూడా సహజమే. కానీ మన అర్హత ఎంత? అనే దాన్ని కూడా ఆలోచించి అంచనా వేసుకోవాలి. ఎందుకంటే అర్హత లేని పదవి, శక్తికి మించిన సంపద, అవమానాలకూ, ఆపదలకూ కారణాలవుతాయి. అందుకే అంటారు అత్యాశను, దురాశను, జయించాలి అని. అప్పుడు మన జీవితమూ ఆనందభరితమవుతుంది. **– చౌటపలి నీరజ**

Edited & Published by G.A. Rao at 21/3, Rajabather Street, T.Nagar, Chennai-17, Phone - 28152043, 28150423
Printed at Sakthi Precess, Chennai - 81 for Ramanjaneya Press, Rajahmundry

REGD.No.TN/CH©/185
Date of Publication :- 4-9-1974
23rd , 24th of Every Month

BUJJAYI

APRIL 2018

